RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 9 ఆగస్ట్ 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:62


## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!: విద్యార్థులను నవ్వించిన ప్రధాని మోదీ

**ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించిన ప్రధాని**

**డిగ్రీలతో పాటు దేశం కోసం ఏదైనా చేయాలనే కలను మోసుకెళ్తున్నారన్న మోదీ**

**3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, ప్రతిభావంతులకు పురస్కారాలు**

**ప్రతిభావంతులైన విద్యార్థినుల సంఖ్య పెరగాలంటూ సరదాగా వ్యాఖ్య**



ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు.

"మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు" అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు" అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. "ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి" అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి.

అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

## ప్రాజెక్టులపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు.. కాల్వలు తవ్వకుండానే అంకితమిచ్చారు: జూపల్లి

**రాజకీయాల కోసం ప్రాజెక్టుల అంశాన్ని బీఆర్ఎస్ తెరపైకి తెస్తోందన్న జూపల్లి**

**పాలమూరు ప్రాజెక్టులను గత బీఆర్ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శ**

**పాలమూరు-రంగారెడ్డి పూర్తికాకుండానే జాతికి అంకితం చేశారని మండిపాటు**



తెలంగాణ తాగు, సాగునీటి ప్రాజెక్టులపై మాట్లాడే కనీస అర్హత కూడా బీఆర్ఎస్ నాయకులకు లేదని మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్ ప్రాజెక్టుల అంశాన్ని తెరపైకి తెస్తోందని ఆరోపించారు. జూరాలలో ఉన్న ప్రసుత నీటిమట్టంతో మొత్తం ఆయకట్టుకు నీరు అందించడం అసాధ్యమని ఆయన స్పష్టం చేశారు. ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

పదేళ్ల పాలనలో పాలమూరు ప్రాజెక్టులను బీఆర్ఎస్ పట్టించుకోలేదని మంత్రి మండిపడ్డారు. రూ. 80 వేల కోట్లు పట్టే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై కేవలం రూ. 19 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేసి, కనీసం కాల్వలు కూడా తవ్వకుండానే జాతికి అంకితం ఇచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 68.5 శాతం వాటా రావాల్సి ఉండగా... కేసీఆర్ హయాంలో తెలంగాణకు కేవలం 299 టీఎంసీలకు మాత్రమే కేటాయింపులు జరగ్గా... ఏపీకి 512 టీఎంసీలు దక్కేలా చేశారని మంత్రి మండిపడ్డారు.

## హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు.. సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

వార్త 2 లో



ప్రజాబలం

9 ఆగస్ట్ 2026 ఆదివారం

# యూపీఐ ఛార్జీలపై మరింత స్పష్టతనిచ్చిన కేంద్రం

**యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడి**
**భవిష్యత్తులో వ్యాపారులపై నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశం**
**యూపీఐ వ్యవస్థ మన్నిక, భద్రత కోసమే ఈ చర్యలన్న కేంద్రం**




యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని కేంద్ర ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. భవిష్యత్తులో వ్యాపార లావాదేవీల కోసం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) అమలు చేసినప్పటికీ, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన లావాదేవీలపై మాత్రమే ఉంటుందని, అది కూడా నామమాత్రంగానే ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007కు ప్రతిపాదించిన సవరణలపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టతనిచ్చింది. యూపీఐ ద్వారా వ్యక్తుల మధ్య జరిగే (పీ2పీ) లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొంది. వ్యాపారులపై అకస్మాత్తుగా ఎండీఆర్ భారం మోపబోమని, ఒకవేళ రుసుములు ప్రవేశపెట్టినా అవి డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపై విధించే ఛార్జీల కంటే చాలా తక్కువగా ఉంటాయని వివరించింది.

యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలిక మన్నికను కాపాడటంతో పాటు, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఈ సవరణలు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సదరు బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన అనంతరం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని కమిటీ ఎండీఆర్ అమలుపై తుది నిర్ణయం తీసుకోనుంది.

2026 జులై నెలలో యూపీఐ ద్వారా రూ. 29.9 లక్షల కోట్ల విలువైన 2,366 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో, దాని నిర్వహణకు, సాంకేతిక భద్రతకు నిరంతర పెట్టుబడులు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇదే తరుణంలో వినియోగదారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే అందుతాయని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ సైతం స్పష్టం చేశారు. ఇప్పటికే పేమెంట్స్ కౌన్సిల్, ఫోన్ పే యాజమాన్యం కూడా యూపీఐ ఛార్జీలపై వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.

# మోదీతో సుఖ్‌బీర్ బాదల్ భేటీ.. పొత్తు పునరుద్ధరణ దిశగా

## బీజేపీ-శిరోమణి అకాలీదళ్ కసరత్తు?

**డీలిమిటేషన్ కు మద్దతు ప్రకటించిన సుఖ్‌బీర్ సింగ్ బాదల్**
**గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన శిరోమణి అకాలీదళ్**
**ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ పరిణామాలు**



శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) అధినేత సుఖ్‌బీర్ సింగ్ బాదల్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమైన మరుసటి రోజే కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) ప్రక్రియకు బాదల్ మద్దతు ప్రకటించారు. దీంతో, పంజాబ్‌లో బీజేపీ – అకాలీదళ్ మధ్య మళ్లీ పొత్తు పొడుస్తోందనే చర్చలు ఊపందుకున్నాయి. ప్రధానితో జరిగిన భేటీ సానుకూలంగా జరిగిందని, పంజాబ్ అభివృద్ధి, రైతుల ప్రయోజనాలే ధ్యేయంగా కూటమి పునరుద్ధరణ దిశగా అడుగులు పడుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి.గతంలో సాగు చట్టాల వివాదంతో ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన అకాలీదళ్, ప్రస్తుతం పంజాబ్‌లో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో మళ్లీ కమలం పార్టీతో జతకట్టేందుకు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్లమెంట్ స్థానాల పునర్విభజనపై కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతు పలకడం కూడా ఈ పొత్తు సంకేతాలలో భాగమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ భేటీ పంజాబ్ రాజకీయాల్లో కొత్త మైత్రికి దారితీస్తుందనే చర్చలు జోరందుకున్నాయి.

# 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగులు

హైదరాబాద్, ఆగస్టు 8 తెలంగాణ ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో విస్తుపోయే అక్రమం వెలుగులోకి వచ్చింది. ఒకే ఆధార్ నంబర్‌తో వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించడమే కాకుండా, నెలకు లక్షల్లో రెండు జీతాలు దర్జాగా గుంజుతున్న ఘరానా మోసం బట్టబయలైంది. రాష్ట్ర ఆర్థిక శాఖ చేపట్టిన సాంకేతిక తనిఖీల్లో ఈ‌గ్భ్రాంతికరమైన విషయం నిగ్గుతేలింది. ప్రభుత్వ ఉద్యోగుల వివరాలను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌లో ఉద్యోగుల ఆధార్, సర్వీస్ వివరాల ధృవీకరణ చేపట్టాల్సిందిగా సర్కార్ ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రాస్ చెకింగ్ ప్రక్రియలోనే అసలు అవకతవకలు బయటపడ్డాయి.ఆర్థిక శాఖ ప్రాథమిక పరిశీలన ప్రకారం.. కేవలం 40 ఆధార్ నంబర్లకు ఏకంగా 80 మంది ఉద్యోగుల వివరాలు అనుసంధానమై ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అంటే ప్రతి ఒక్క ఆధార్ నంబర్‌పై ఇద్దరేసి ఉద్యోగులు వేర్వేరు పేర్లతో ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు పొందుతున్నారు. ఇందులో విస్తుపోయే అంశమేమిటంటే.. ఇలా ఒకే ఆధార్‌పై రెండేసి జీతాలు తీసుకుంటున్న వారిలో ఎక్కువ మంది రెగ్యులర్ ఉద్యోగులే ఉన్నారు. ఒక్కో ఉద్యోగి హోదాను బట్టి నెలకు 1 లక్ష నుంచి ఏకంగా 4 లక్షల వరకు ప్రభుత్వ ధనాన్ని చట్టవిరుద్ధంగా డ్రా చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, విద్యా శాఖ, పంచాయతీ రాజ్, ప్రజారోగ్య శాఖల్లో ఇలాంటి డూప్లికేట్ కేసులు ఎక్కువగా నమోదైనట్లు ఆర్థిక శాఖ అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఐఎఫ్ఎంఐఎస్ సిస్టమ్‌లో పనిచేస్తున్న రెగ్యులర్, గ్రాంట్-ఇన్-ఎయిడ్ , తాత్కాలిక సిబ్బంది డేటాను ఆధార్‌తో అనుసంధానించి క్రాస్‌చెక్ చేయడంతో ఈ బండారం బయటపడింది. వేర్వేరు శాఖల్లో, వేర్వేరు పేర్లతో ఉద్యోగాలు చేస్తూ ఒకే ఆధార్‌ను ఉపయోగించడం వెనుక పెద్ద ఎత్తున సాంకేతిక అక్రమాలు లేదా ఐడెంటిటీ ఫ్రాడ్ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన రాష్ట్ర ప్రభుత్వం.. డూప్లికేట్ ఆధార్ మ్యాపింగ్‌లపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని, అక్రమాలకు పాల్పడిన వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.ఒకటి కంటే ఎక్కువ ప్రభుత్వ సంస్థలు లేదా శాఖల నుంచి అక్రమంగా జీతాలు పొందినట్లు రుజువైతే సదరు ఉద్యోగులపై తక్షణమే శాఖాపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు, ఇప్పటివరకు అక్రమంగా డ్రా చేసిన ప్రభుత్వ సొమ్మును పైసా సైతం వదలకుండా రికవరీ చేయాలని స్పష్టం చేసింది. తీవ్రమైన అక్రమాలకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించింది. అంతటితో ఆగకుండా.. ఈ అవకతవకలకు సహకరించిన, లేదా డ్రాయింగ్ అండ్ డిస్‌బర్సింగ్ స్థాయిలో నిర్లక్ష్యం వహించిన అధికారుల బాధ్యతను కూడా నిర్ధారించి వారిపై కూడా చర్యలు తీసుకోనున్నారు.ఈ వ్యవహారంపై అన్ని శాఖలు తక్షణమే దృష్టి సారించి, సమగ్ర విచారణ, రికవరీ మరియు క్రిమినల్ చర్యల వివరాలతో కూడిన యాక్షన్ టేకెన్ రిపోర్ట్ ను సరిగ్గా 7 రోజుల్లోగా తమకు సమర్పించాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ స్కామ్‌తో సంబంధం ఉన్న ఉద్యోగుల్లో, సహకరించిన అధికారుల్లో తీవ్ర భయాందోళనలు మొదలయ్యాయి.

# హైడ్రాలో 150 ఉద్యోగాలకు వేలల్లో అభ్యర్థులు..

## సరూర్‌నగర్ స్టేడియంలో తోపులాట..

హైద్రాబాద్, ఆగస్టు 8 హైదరాబాద్‌లో కొద్దిపాటి ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు ఏ స్థాయిలో ఎదురుచూస్తున్నారో చెప్పేందుకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ఘటనే నిదర్శనం. 'హైడ్రా' ప్రకటించిన 150 పోస్టుల కోసం వేలాది మంది యువత తరలిరావడంతో తీవ్ర తోపులాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. హైడ్రా విభాగంలో 100 డీఆర్ఎఫ్ అసిస్టెంట్లు, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టుల భర్తీకి అధికారులు ప్రకటన విడుదల చేశారు. దీని కోసం ఆగస్టు 8, 9 తేదీల్లో సరూర్‌నగర్ స్టేడియంలో ఉదయం 5 గంటల నుంచి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 800 మీటర్ల పరుగు, 100 మీటర్ల స్ప్రింట్, లాంగ్ జంప్, షాట్‌పుట్ వంటి ఈవెంట్లలో అర్హత సాధించాలని సూచించారు.అయితే, ప్రకటించిన పోస్టుల కంటే కొన్ని వందల రెట్లు ఎక్కువగా నిరుద్యోగులు ఇవాళ తెల్లవారుజామునకే స్టేడియం వద్దకు చేరుకున్నారు. లోపలికి వెళ్లే క్రమంలో ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి అదుపుతప్పింది. ఈ క్రమంలో జరిగిన తోపులాటతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగ ప్రవేశం చేసి, గుంపును చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.ఈ తోపులాటకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కేవలం 150 ఉద్యోగాలకే ఈ స్థాయిలో పోటీ ఉందంటే రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్రతను అర్థం చేసుకోవచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

హైకోర్టు మళ్లీ చివాట్లు

హైదరాబాద్ నగరాన్ని వరద ముప్పు నుంచి కాపాడటానికి, చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి చేయడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో 'హైడ్రా' (ఊజఆఖీ౦) వ్యవస్థను ఏర్పాటు చేసింది. రంగంలోకి దిగిన తొలి రోజుల్లోనే అనేక అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేస్తూ సంచలనం సృష్టించిన ఈ సంస్థ, ప్రస్తుతం ఒక కీలకమైన న్యాయపోరాటాన్ని ఎదుర్కొంటోంది. సల్కం చెరువు పరిధిలోని ఆక్రమణలపై చర్యలు తీసుకోవడంలో జాప్యం జరగడంతో తెలంగాణ హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.నగరంలోని సల్కం చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్ (ఈఒఆ), బఫర్ జోన్ పరిధిలో శాశ్వత నిర్మాణాలు వెలిశాయనేది ప్రధాన వివాదం. ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీకి చెందిన విద్యాసంస్థలు ఇక్కడ అక్రమంగా భవనాలు నిర్మించాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. శాటిలైట్ చిత్రాలు, రెవెన్యూ రికార్డులను ఆధారంగా చూపుతూ, ఈ ఆక్రమణల వల్ల వర్షాకాలంలో సమీప ప్రాంతాలన్నీ జలమయమవుతున్నాయని వాదించారు. చెరువు ఉనికికే ప్రమాదం ఏర్పడినప్పటికీ, సంబంధిత యంత్రాంగం ఉపేక్ష వహిస్తోందని కోర్టులో పేర్కొన్నారు.గతంలోనే ఈ అంశంపై విచారణ జరిపిన ధర్మాసనం, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలిచ్చింది. అయితే ఆదేశాలు వెలువడి నెలలు గడుస్తున్నా క్షేత్రస్థాయిలో ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా పరిగణించింది. న్యాయస్థాన ఉత్తర్వులను అమలు చేయకపోవడాన్ని కోర్టు ధిక్కరణగా భావిస్తూ, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తో పాటు పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రెవెన్యూ, నీటిపారుదల, విద్యాశాఖల ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది.

# విద్యావిధానంలో మార్పులు అనివార్యమా...

కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాను కేవలం ఒక వ్యక్తి రాజకీయ పరాజయంగా మాత్రమే చూడకూడదు. అది భారత విద్యా వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోతున్న లోతైన సంస్థాగత సంక్షోభానికి ప్రతీకగా భావించాలి. ఈ రాజీనామా ప్రజా ఒత్తిడితో జరిగిందా, రాజకీయ వ్యూహంలో భాగమా అన్నది పక్కన పెడితే, విద్యార్థులు లేవనెత్తిన ప్రధాన ప్రశ్నలకు ఇంకా సమాధానాలు లభించలేదు. భారతదేశం తన పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పగలదా? బాధ్యత అనేది కేవలం రాజకీయ త్యాగాలకు మాత్రమే పరిమితమవుతుందా? మౌనంగా ఉండేందుకు నిరాకరిస్తున్న యువత ఆకాంక్షలకు పాలన అనుగుణంగా మారగలదా? విద్యార్థుల ఉద్యమం ఒక చారిత్రక విజయాన్ని సాధించింది. మంత్రి రాజీనామా ప్రజాస్వామ్య పోరాటానికి నైతిక విజయమే అయినప్పటికీ, ఒక వ్యక్తిని మార్చడం ద్వారా వ్యవస్థాగత లోపాలు తొలగిపోతాయని భావించడం సరళీకరణ అవుతుంది. ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షలలో అక్రమాలు, పరిపాలనా పారదర్శకత లోపం, విద్యాసంస్థలపై తగ్గుతున్న విశ్వాసం వంటి సమస్యలు దశాబ్దాలుగా పేరుకుపోయిన నిర్మాణాత్మక వైఫల్యాలు. ఒక రాజీనామాతో అవి అంతరించిపోవు.ఈ ఉద్యమంలో అత్యంత విశేషమైన అంశం జనరేషన్ -జెడ్ ఒక స్వతంత్ర రాజకీయ శక్తిగా అవతరించడం. గతంలో విద్యార్థి ఉద్యమాలు రాజకీయ పార్టీల ఆధిపత్యంలో నడిచినప్పటికీ, ఈ ఉద్యమం డిజిటల్ సమీకరణ, వికేంద్రీకృత నాయకత్వం, సమస్యల ఆధారిత రాజకీయాల చుట్టూ రూపుదిద్దుకుంది. నేటి యువతకు సిద్ధాంత నినాదాల కంటే విద్యా న్యాయం, ఉపాధి అవకాశాలు, పారదర్శక పరిపాలన వంటి అంశాలే ముఖ్యంగా మారాయి. ఇది భారత ప్రజాస్వామ్యంలో భాగస్వామ్య స్వరూపం మారుతున్నదనడానికి నిదర్శనం. ఈ నిరసనలు పరీక్షా సంస్కరణలకే పరిమితం కాకుండా, యువతలో పెరుగుతున్న అసంతృప్తికి ప్రతీకగా మారాయి. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలపై అనిశ్చితి, వరుసగా జరుగుతున్న పరీక్షా అవకతవకలు, ప్రభుత్వ సంస్థలపై తగ్గుతున్న నమ్మకం -ఇవన్నీ కలిసి యువతలో తీవ్ర నిరాశను కలిగించాయి. అందువల్ల ఈ ఉద్యమం ఒక పరీక్ష గురించి మాత్రమే కాకుండా, ఒక తరం భవిష్యత్తు గురించి సాగిన పోరాటంగా మారింది ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ప్రజాభిప్రాయానికి స్పందించాల్సిన బాధ్యత కలిగి ఉంటాయి. బాధ్యత అనేది రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం. అయితే అది కేవలం మంత్రి రాజీనామాతో ముగియకూడదు. పరీక్షల నిర్వహణ సంస్థలు, నియామక సంస్థలు, పోలీసు దర్యాప్తు యంత్రాంగం, సైబర్ భద్రతా వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, పోటీ పరీక్షల నిర్వహణలో భాగస్వాములైన అన్ని పరిపాలనా సంస్థలకు కూడా సమానంగా వర్తించాలి. సంస్థాగత బాధ్యత లేకుండా రాజకీయ బాధ్యత ప్రతీకాత్మకంగానే మిగిలిపోతుంది. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్య ప్రజాస్వామ్య పాలనలో మరో కీలక కోణాన్ని గుర్తుచేస్తుంది. శాంతియుత నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుని రాజ్యాంగబద్ధ హక్కు. అదే సమయంలో చట్టం, శాంతి భద్రతలను కాపాడే బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటిస్తూ, పోలీసు చర్యలు పారదర్శకంగా, నిష్పాక్షికంగా, పౌరహక్కులను గౌరవించే విధంగా ఉండాలి. ప్రజాస్వామ్యం విభేదాలను అణచివేయడం వల్ల కాదు; ప్రజల ఆందోళనలను నిర్మాణాత్మకంగా వినడం వల్ల బలపడుతుంది. సమకాలీన రాజకీయ చర్చలను ప్రభావితం చేయడంలో సామాజిక మాధ్యమాల పాత్ర కూడా ఎంతో పెరిగింది. మీమ్స్, వ్యంగ్య చిత్రాలు, డిజిటల్ ప్రచారాలు ప్రజల దృష్టిని ఆకర్షించే శక్తివంతమైన సాధనాలుగా మారాయి. అయితే అవి సంక్లిష్టమైన విధాన చర్చలను అతిగా సరళీకరించే ప్రమాదం కూడా ఉంది. ప్రజాభిప్రాయం వైరల్ కథనాల కంటే ఆధారాలతో కూడిన సమాచారంపై ఆధారపడాలి. అదే విధంగా, ఇ-20 ఇథనాల్ మిశ్రమ ఇంధనం చుట్టూ జరిగిన చర్చలు ప్రజల విశ్వాసం పారదర్శకమైన శాస్త్రీయ సమాచారంపై ఆధారపడుతుందని స్పష్టం చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ, ఇంధన భద్రత, సాంకేతిక మార్పులకు సంబంధించిన ప్రభుత్వ విధానాలు నిరంతర ప్రజా చర్చకు లోనవ్వాలి. ప్రజలకు ప్రయోజనాలు, ఖర్చులు, దీర్ఘకాలిక ప్రభావాలపై స్పష్టమైన ఆధారాలతో కూడిన సమాచారం అందించాలి. ఈ రాజీనామా భారత రాజకీయాల్లో ఒక మలుపుగా నిలుస్తుందనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ప్రజల నిరంతర ఒత్తిడి ప్రభుత్వాలను తమ నిర్ణయాలను పునఃపరిశీలించడానికి దారితీయగలదనే విషయాన్ని ఇది సూచిస్తుందని కొందరు విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై తుది తీర్పు భవిష్యత్ రాజకీయ పరిణామాలపై ఆధారపడి ఉంటుంది. ప్రజాస్వామ్య చరిత్రలో ఇటువంటి సంఘటనలు కాలక్రమేణా పౌరులు, -ప్రభుత్వాల సంబంధాన్ని పునర్నిర్వచిస్తాయి. అత్యంత ముఖ్యంగా, భారత విద్యా సంక్షోభం ప్రశ్నాపత్రాల లీకులతో మాత్రమే పరిమితం కాదు. పరీక్షల వాయిదాలు, నియామకాల ఆలస్యం, విద్యాసంస్థల్లో ఖాళీలు, ఉన్నత విద్యలో తగిన పెట్టుబడుల కొరత, విద్యా రంగం వాణిజ్యీకరణ- ఇవన్నీ కలిసి విద్యార్థుల విశ్వాసాన్ని దెబ్బతీశాయి. విద్యా పరిపాలనలో సమగ్ర సంస్కరణలు లేకుండా పరీక్షా సంస్కరణలు మాత్రమే ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించలేవు. భారతదేశానికి అత్యవసరంగా సమగ్ర పరీక్షా సమగ్రత వ్యవస్థ అవసరం. సురక్షితమైన డిజిటల్ మౌలిక వసతులు, స్వతంత్ర పరీక్షా నియంత్రణ సంస్థలు, బలమైన సైబర్ భద్రతా వ్యవస్థలు, నియామక ప్రక్రియల పారదర్శక ఆడిట్లు, పరీక్షా మోసాలపై వేగవంతమైన న్యాయ చర్యలు, సమాచార బహిర్గతం చేసే వ్యక్తులకు రక్షణ, పోటీ పరీక్షలకు దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రమాణాలు ఏర్పాటు చేయాలి. అలాగే తీవ్రమైన విద్యా ఒత్తిడిని ఎదుర్కొంటున్న విద్యార్థులకు మానసిక సలహా, సహాయక వ్యవస్థలను బలోపేతం చేయాలి. చివరికి, ఏ విద్యార్థి ఉద్యమానికైనా నిజమైన విజయాన్ని కేవలం ఒక మంత్రి రాజీనామాతో కొలవలేం. అది శాశ్వతమైన సంస్థాగత సంస్కరణలకు దారితీస్తే చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. నిర్మాణాత్మక సంస్కరణలే శాశ్వత మార్పును తీసుకువస్తాయి. ఈ పరిణామాలు విధాన నిర్ణేతలకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. విద్య అనేది కేవలం పరిపాలనా రంగం కాదు; అది కోట్లాది భారత యువత కలలు, ఆశయాలు, భవిష్యత్తుకు ప్రతీక. పరీక్షా వ్యవస్థ విశ్వసనీయతను పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత పెంపొందించడంలో, విద్యార్థుల రాజ్యాంగబద్ధ హక్కులు రక్షించడం, ప్రజల విశ్వాసాన్ని తిరిగి నెలకొల్పడం జాతీయ ప్రాధాన్య అంశాలు మారాలి. అప్పుడే భారతదేశం ప్రజల ఆగ్రహాన్ని అర్థవంతమైన విద్యా సంస్కరణలు, ప్రజాస్వామ్య పునరుజ్జీవనంగా మార్చగలదు.

# హైదర్ నగర్ జయదుర్గ మైసమ్మ తల్లి బోనాలు

## అంగరంగ వైభవంగా జరుగుతాయి:

## కార్యనిర్వహణాధికారి సతీష్ బాబు



**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )ఆగస్టు 8** శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధి లోని హైదర్ నగర్ గ్రామం లోని 9వ నెంబర్ జాతీయ రహదారి పై ఉన్న అమ్మవారు జయదుర్గ మైసమ్మ తల్లి బోనాలు ఆదివారం అంగరంగ వైభవంగా జరగనున్నట్లు దేవాలయ కమిటీ కార్య నిర్వాహణాదికారి సతీష్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆదివారం కంటే రెండు రోజులు ముందుగానే ఆలయాన్ని అతి సుందరంగా తీర్చిదిద్ది శానిటరీ విభాగం పారిశుద్ధ్య కార్మికులచే పరిశు భ్రతగా ఆలయం చుట్టుపక్కల వైపు రంగురంగుల బలుపులతో అందంగా ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఈసారి ప్రతి ఏడాది కంటే మరింత శోభాయానంగా అమ్మవారి రూపంతో పాటు ఆలయ ప్రాంగణం అంతయు భక్తులతో కిటకి టలాడు ఈ ఆలయ ప్రాంగణాన్ని అన్ని విధాలుగా భారీకేడ్లు రెగ్యులర్ గా మహిళ భక్తులు బోనాలను తీసుకు వచ్చే మహిళలు ఒక్కొక్కరికి వేర్వేరుగా దారులను ఏర్పాటు చేసి అన్ని సౌకర్యాలతో కూడిన ఆలయంగా ఈ సారి దర్శనమివ్వడం భక్తులు మరింత ఉత్సాహంతో భక్తిశ్రద్ధలతో అమ్మ వారిని మొక్కు తీర్చుకునేందుకు శ్రద్ధను చూపు తున్నట్లు తీర్చిదిద్దామన్నారు. హైదర్ నగర్ జయదుర్గ (మైసమ్మ) భ్రమరాంబ మల్లికార్జున ఆలయ చైర్మన్లు బోనాల రోజు అయిన ఆదివారం ఆలయానికి వచ్చే భక్తులకు పెద్ద ఎత్తున ప్రతి ఏడాదిలాగ తీర్థ ప్రసాదములను స్వయంగా వారే చేసి అందించేందుకు సిద్ధమైఉన్నట్లు ఈవో సతీష్ బాబు తెలియజేశారు. ఆలయం వెలుపల బోనాలను తీసుకొని ఘటాలు మొక్కు బడులను చెల్లించేందుకు వచ్చే మహిళా భక్తులకు ప్రత్యేకంగా దారులను ఏర్పా టు చేసిన వాటి ద్వారానే వెళ్లాల్సి
వస్తుందని ప్రధాన అర్చకులు అయిన నవీన్ పంతులు,చంద్రశేఖర్ పురోహి తులు భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వారి పూజలను క్షణాల్లో అందుకొని అమ్మవారిని సమర్పిం చేందుకు సమయస్ఫూ ర్తితో విధులు నిర్వహించేందుకు వారు సైతం సిద్ధమే నన్నారు. బయట భక్తులు బోనాలు ఘటాలు కోళ్లు, యాటలు తీసుకుని వచ్చి అమ్మవారిని సమర్పించేందుకు భాజా భజంత్రీల నడుమ పోతరాజుల విన్యాసాల నడుమ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బోనాలను ఆలయం చు ట్టూ తిప్పి వారు అనుకున్న ఘటాలను ముందు కట్టేందుకు ఆలయ కమిటీ వారు చూపించే ఆప్యాయతలతో ఎలాంటి ఇబ్బందులు కలగనీయకుండా కార్యనిర్వహణాధికారి సతీష్ బాబు పిలుపు మేరకు కెపిహెచ్బి పోలీస్ స్టేషన్ ఆదేశానుసారంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి భక్తులకు మరింత తక్కువ సమయంలో వారు అనుకున్న పూజల ను చేసుకొని వెళ్లేందుకు సహకరించార న్నారు.ప్రతి ఏడాది కంటే మరింత రెట్టింపు స్థాయిలో ఈ గ్రామ ప్రజలే కాకుండా చుట్టుపక్కల ఉన్న కాలనీవా సులు సైతం ఒక పెద్ద జాతరగా తయార వుతుందని తెలిపారు. ఆలయం వైపు ఈరోజు వచ్చే భక్తులకు పద్ధతిలో పూజలు చేసుకుని సంతోషంగా వారి ఇండ్లకు వెళ్లేందుకు అన్ని విధాల సహకారాన్ని అందజేసినట్లు తెలిపారు. విషయాలపై ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుతుందా కేపీహెచ్బీ పోలీసులు బందోబస్తు కోసం సిద్ధంగా ఉంటారన్నారు.

# చరిత్ర పుటల్లో స్వర్ణాక్షరాలతో లిఖించదగిన మహావీరుడు పండుగ సాయన్న

### జహీరాబాద్‌లో ఘనంగా 135వ జయంతి ఉత్సవాలు

### తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్

**జహీరాబాద్, ఆగస్టు 8 ప్రజాబలం ప్రతినిధి:** అన్యాయం, దోపిడీ, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన మహావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ అన్నారు. చరిత్ర మరచిన ఓ వీరుడి గాథను నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పండుగ సాయన్న ముదిరాజ్ 135వ జయంతిని పురస్కరించుకుని శనివారం జహీరాబాద్ పట్టణంలో ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జహీరాబాద్ బస్టాండ్ నుంచి ప్రధాన కూడళ్ల మీదుగా






అంబేద్కర్ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పండుగ సాయన్న ముదిరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం సిద్దు రావణ్ మాట్లాడుతూ.. రాజ్యం భ్రష్టుపట్టినప్పుడు, అవినీతి, దోపిడీ, అన్యాయం పెరిగినప్పుడు ప్రజల్లో నుంచి వీరులు ఉద్భవిస్తారని అన్నారు. అణగారిన వర్గాల కోసం గొంతెత్తి, అన్యాయాన్ని ఎదిరించిన మహావీరుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని పేర్కొన్నారు.

నిజాం పాలనలో రజాకార్ల అరాచకాలు కొనసాగుతున్న సమయంలో భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాడారని తెలిపారు. పెత్తందారుల నుంచి పేదలకు అండగా నిలిచిన ఆయనను బందిపోటుగా చిత్రీకరించారని, రజాకార్ల పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసినందుకు ఆయనను దారుణంగా హతమార్చారని పేర్కొన్నారు.

ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే వారిని దేశద్రోహులు, తీవ్రవాదులుగా ముద్రవేసే పరిస్థితులు నేటికీ కనిపిస్తున్నాయని సిద్దు రావణ్ విమర్శించారు. వ్యవస్థను ప్రశ్నిస్తే మరణమే శాసనం అన్న సందేశాన్ని పాలక వ్యవస్థలు ఇస్తున్నప్పటికీ.. వీరులకు మరణం ఉండదని, వారు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. విప్లవాలకు అంతం ఉండదని పండుగ సాయన్న జీవితం మరోసారి నిరూపించిందన్నారు.

ప్రభుత్వం అధికారికంగా జయంతి నిర్వహించాలిపండుగ సాయన్న ముదిరాజ్ జయంతిని తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని సిద్దు రావణ్ డిమాండ్ చేశారు. ఆయన పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి, భవిష్యత్ తరాలకు ఆయన సేవలను పరిచయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్తలు, ఉద్యమకారులు, కార్యకర్తలతో పాటు భీమ్ ఆర్మీ నియోజకవర్గ, మండల నాయకులు శంకర్, నరసింహ, గోపాల్, బాలరాజు, విజయ్, రాములు, మహమ్మద్ అలీం, సలీం, నర్సింలు ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్, ప్రేమ్‌కుమార్, అనంతరం సదానంద్, రామచందర్, ధనరాజ్, బక్కన్న, బుద్ధిష్ట్ రాహుల్, బీసీ సంఘ నాయకులు నర్సింలు ముదిరాజ్, సిద్ధార్థ్, అడ్వకేట్ రాకేష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, వెంకన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# తప్పులు పాలకులవి.. తిప్పలు అధికారులవి

## అధికారులను కోర్టుల చుట్టూ తిప్పొద్దు: తాడూరి శ్రీనివాస్



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 8:**తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలనపై పట్టు కోల్పోయిందని, ప్రభుత్వ విధానాల వైఫల్యాలకు అధికారులు బాధ్యత వహించే పరిస్థితి ఏర్పడిందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్ ఆరోపించారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన రాష్ట్ర ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నేడు కోర్టుల చుట్టూ తిరుగుతూ అఫిడవిట్లు దాఖలు చేయడం, కోర్టు ఆదేశాలకు వివరణలు ఇవ్వడం, కాంటెంప్ట్ కేసులు, సమన్లు వంటి పరిస్థితులను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. లి"ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను ఇండియన్ కోర్ట్ అటెండింగ్ సర్వీస్‌గా మార్చిన పరిస్థితి కనిపిస్తోంది"లి అని వ్యాఖ్యానించారు.

తప్పులు పాలకులవి.. తిప్పలు అధికారులవా?లి

ముఖ్యమంత్రి, మంత్రులు తీసుకునే విధానపరమైన నిర్ణయాలకు రాజకీయ నాయకత్వమే బాధ్యత వహించాల్సి ఉండగా, ఆ నిర్ణయాలపై అధికారులు కోర్టుల్లో వివరణ ఇవ్వాల్సిన పరిస్థితి రావడం సరికాదన్నారు. ప్రభుత్వ నిర్ణయాలకు రాజకీయ లబ్ధి పొందేది పాలకులేనని, అయితే వాటిపై కోర్టుల్లో సమాధానం చెప్పాల్సింది అధికారులు అవుతున్నారని విమర్శించారు.

హైడ్రా, చెరువులు, ఎఫ్‌టీఎల్ తదితర అంశాల్లో ప్రభుత్వం తరఫున కోర్టుల్లో దాఖలైన అఫిడవిట్లలో భిన్నమైన వాదనలు కనిపిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి, మంత్రులపై ఉందన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, పెన్షనర్లు, రైతు భరోసా తదితర అంశాల్లో కోర్టుల జోక్యం తర్వాతే ప్రభుత్వం స్పందిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని శ్రీనివాస్ ఆరోపించారు. ప్రజలకు ఉపయోగపడే నిర్ణయాలు కోర్టు ఆదేశాల తర్వాతే అమలు చేయాల్సిన పరిస్థితి రావడం పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమన్నారు.

సీనియర్ ఐఏఎస్ అధికారి సందీప్ సుల్తానియా సహా పలువురు అధికారులు వివిధ కేసుల్లో కోర్టుల ముందు హాజరవుతున్నారని తెలిపారు. జీహెచ్‌ఎంసీ, పోలీస్, హోంశాఖ తదితర విభాగాల అధికారులు కూడా న్యాయస్థానాల చుట్టూ తిరగాల్సి వస్తోందని అన్నారు.

తరచూ బదిలీలతో పరిపాలనకు ఆటంకంలి

ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తరచూ బదిలీ చేయడం వల్ల పరిపాలనలో స్థిరత్వం దెబ్బతింటోందని శ్రీనివాస్ విమర్శించారు. ఒక శాఖలో బాధ్యతలు స్వీకరించి, పని విధానాన్ని అర్థం చేసుకునేలోపే బదిలీ చేస్తే అధికారులు సమర్థవంతంగా ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు.

అధికారుల అనుభవం, సామర్థ్యం, గత పనితీరును పరిగణనలోకి తీసుకుని పోస్టింగులు ఇవ్వాలని సూచించారు. రాజకీయ ఒత్తిళ్లకు అధికారులు గురికాకుండా వారి పరిపాలనా స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని ప్రభుత్వం కాపాడాలని డిమాండ్ చేశారు.

రిటైర్డ్ చీఫ్ సెక్రటరీలు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను తిరిగి ప్రభుత్వ సలహాదారులుగా, ఇతర కీలక పదవుల్లో నియమించడంపైనా ఆయన ప్రశ్నలు సంధించారు. ప్రస్తుతం సేవలో ఉన్న సమర్థులైన అధికారులను పక్కన పెట్టి రిటైర్డ్ అధికారులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు.

గ్రూప్-1 సహా ఇతర సీనియర్ అధికారులు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న సమయంలో కీలక పోస్టుల్లో రిటైర్డ్ అధికారులను నియమించడం వల్ల కొత్త తరానికి అవకాశాలు తగ్గుతున్నాయని అన్నారు.

పోస్టింగులపై ఆరోపణలపై విచారణ జరపాలిలి

కొన్ని శాఖల్లో పోస్టింగులు వేలం, టెండర్ల తరహాలో జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ ఆరోపణలు నిజమైతే ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

ఒక్కో ఐఏఎస్ అధికారికి నాలుగు, ఐదు, ఆరు శాఖల బాధ్యతలు అప్పగిస్తే ప్రతి శాఖపై పూర్తి స్థాయిలో దృష్టి సారించడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. మినిమం గవర్నెన్స్ మ్యాక్సిమం డెలివరీ ఉండాల్సిన సమయంలో పరిపాలనా వ్యవస్థలో గందరగోళం నెలకొందని విమర్శించారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలిలి

ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందుల భారాన్ని అధికారులపై మోపడం సరికాదన్నారు. ప్రభుత్వ విధానాలపై రాజకీయ నాయకత్వమే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు.

అధికారులను పదేపదే బదిలీ చేసి, కోర్టుల చుట్టూ తిప్పకుండా ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. అధికారుల గౌరవాన్ని కాపాడుతూ, అర్హత--సామర్థ్యం ఆధారంగా బాధ్యతలు అప్పగించాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ప్రస్తుత పరిస్థితుల్లో మార్పు రాకపోతే అధికారుల గౌరవం, ప్రజా సమస్యలు, పరిపాలనా వ్యవస్థ పరిరక్షణ కోసం బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు చేపడతామని తాడూరి శ్రీనివాస్ హెచ్చరించారు.

తెలంగాణ ప్రజలు ప్రభుత్వ పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా పాలనా విధానాలను సమీక్షించుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు.

# ఐఏఎస్ ల బదిలీలు

విజయవాడ, ఆగస్టు 8 ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ (ఎయా)లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. మొత్తం 20 మంది ఐఏఎస్‌లు, ఇద్దరు ఐఎఫ్‌స్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా జె.శ్యామలరావు, రహదారులు, భవనాల శాఖ కార్యదర్శిగా కోన శశిధర్, ఏపీఎస్ ఆర్టీసీ జాయింట్ డైరెక్టర్‌గా ఎం. శివప్రసాద్‌ను నియమించింది. టూరిజం, యువజన సర్వీసుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఎస్. రావత్, ఆర్కియాలజీ, మ్యూజియం విభాగం కమిషనర్‌గా రేవు ముత్యాలరాజును ప్రభుత్వం నియమించింది. పర్యాటక శాఖ బాధ్యతల్లో ఉన్న ఆమ్రపాలి ని బదిలీ చేసి జీఏడీకి రిపోర్టు చేయాలని ఆదేశించింది.

ఆమ్రపాలికి నో పోస్టింగ్

సీనియర్ ఐఏఎస్ అమ్రపాలికి పోస్టింగ్ లేని బదిలీ చేసింది ఏపీ ప్రభుత్వం. ఐఏఎస్ అధికారిణి కాట ఆమ్రపాలి ఆంధ్రప్రదేశ్ లో విధులు నిర్వహించేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఏపీలో విధుల్లో చేరినప్పటి నుంచి ఆమె విధులకు సక్రమంగా హాజరుకాకపోవడం, సుదీర్ఘకాలంగా సెలవుల్లోనే ఉండటం సర్వీస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. గత మూడు నెలలుగా ఆమె వరుస సెలవుల్లోనే కొనసాగుతుండటంతో, ఏపీ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి ఆమెను పర్యాటక శాఖ నుంచి బదిలీ చేస్తూ సాధారణ పరిపాలనా శాఖ లో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. విభజన చట్టం ప్రకారం ఐఏఎస్‌ల కేటాయింపు ప్రక్రియలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఆమెను ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు కేటాయించింది. అయితే, తన స్వస్థలం హైదరాబాద్ అని, కాబట్టి తెలంగాణలోనే కొనసాగేలా మినహాయింపు ఇవ్వాలని ఆమె కేంద్రంతో పాటు న్యాయస్థానాలను కూడా ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయపోరాటం చేసినప్పటికీ చివరకు ఊరట లభించకపోవడంతో, కేంద్ర ఉత్తర్వులకు లోబడి ఆమె అనివార్య పరిస్థితిల్లో ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్ట్ చేయాల్సి వచ్చింది. కానీ, విధుల్లో చేరిన మొదటి రోజు నుంచే ఆమె పాలనపై పెద్దగా దృష్టి సారించకపోవడమే కాకుండా ఎక్కువ సమయం సెలవులకే మొగ్గు చూపారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేసిన కాలంలో ఆమ్రపాలికి అత్యంత ప్రాధాన్యత కలిగిన జీహెచ్‌ఎంసీ కమిషనర్, హెచ్‌ఎండీఏ వంటి కీలకమైన పోస్టింగ్‌లు దక్కాయి. విశాలమైన అధికారాలు, మెట్రోపాలిటన్ పరిధిలోని పెద్ద పెద్ద ప్రాజెక్టులను నిర్వహించిన అనుభవం ఉన్న ఆమెకు.. ఏపీలో పర్యాటక శాఖ బాధ్యతలు కేటాయించారు. అయితే, ఏపీ ప్రభుత్వంలో బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఆమె పలుమార్లు తెలంగాణ క్యాడర్‌కు తిరిగి వెళ్లేందుకు తీవ్రస్థాయిలోనే ప్రయత్నాలు సాగించారు. కానీ, అందుకు సంబంధించిన మార్గాలు మూసుకుపోవడంతో ఆమె మానసికంగా ఏపీలో సేవలు అందించడానికి సిద్ధంగా లేరనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఒక వైపు రాష్ట్రంలో కీలకమైన శాఖల నిర్వహణకు సమర్థులైన అధికారుల అవసరం ఎంతో ఉంది. ఇటువంటి సమయంలో సీనియర్ ఐఏఎస్ అధికారిణి వరుసగా సెలవుల్లో ఉండటం, కేటాయించిన స్థానంలో నిబద్ధతతో పనిచేయకపోవడం పట్ల సచివాలయ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఆమెను జీఏడీకి అటాచ్ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. తదుపరి ఆమె ఏ రకమైన నిర్ణయం తీసుకుంటారు, మళ్లీ సుదీర్ఘ సెలవు పై వెళ్తారా లేక ఏపీలోనే మళ్లీ సీరియస్‌గా పని చేసేందుకు సిద్ధమవుతారా అన్నది తేలాల్సి ఉంది.

# విజయసాయి పార్టీకి స్పేస్ ఉందా

నెల్లూరు, ఆగస్టు 8, ఏపీలో మరో కొత్త పార్టీకి తెర లేవనుందని లోకల్ పొలిటికల్ సర్కిల్స్‌లో టాక్. పొలిటికల్ ఎంట్రీకి మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రంగం సిద్ధం చేసుకుంటున్నారని సమాచారం. 2029 ఎన్నికలే టార్గెట్‌గా విజయసాయి వ్యూహం రచిస్తున్నట్టు సమాచారం. తన పార్టీకి వెన్నుదన్నుగా ఉండేలా సొంత మీడియాను కూడా ఆయన ఏర్పాటు చేసుకుంటున్నారని తెలుస్తోంది. సోషల్ మీడియా, మీడియా ప్లాట్‌ఫామ్‌ల అండతో తన వాయిస్‌ని, వాదనని ప్రజల్లోకి తీసుకెళ్లేలా చూసుకుంటున్నారట.ఏపీ రాజకీయాలు వైసీపీ వర్సెస్ కూటమి అన్నట్టు సాగుతూ ఉంటాయి. అక్కడ మిగిలిన పార్టీలకు పెద్దగా పొలిటికల్ స్పేస్ ఉండదు. ఇలాంటి పరిస్థితుల్లో? .విజయసాయిరెడ్డి పార్టీకి ఎంతవరకు పొలిటికల్ స్పేస్ దొరుకుతుందో చూడాలంటున్నాయి పొలిటికల్ సర్కిల్స్.చాలాకాలం వైసీపీలో ఉన్న ఆయన, కొన్నాళ్ల కిందట ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. అడపాదడపా వైసీపీ టార్గెట్‌గా విమర్శల బాణాలు సంధిస్తున్నారు. వైసీపీకి వ్యతిరేకంగా చీలో పోస్టులు పెడుతున్నారు. అటు టీడీపీపై కూడా విమర్శలు ఎక్కుపెడుతున్నారు. రాజధాని నిర్మాణంలో అవినీతి జరుగుతోందని ఆరోపిస్తున్నారు. ఆయన వైసీపీని వద్దనుకున్నారు. టీడీపీలోకి ఎంట్రీ ఇచ్చే పరిస్థితి లేదు. అయితే బీజేపీకి కోరస్‌గా హిందుత్వ సైరన్ మోగిస్తున్నారు. మొదట్లో ఆయన బీజేపీలోకి వెళదామనుకున్నారనే టాక్ వినిపించింది. అయితే కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీలోకి ఆయన వెళ్లే అవకాశం తక్కువగా ఉందంటున్నారు.దీంతో సొంత పార్టీ పెట్టాలనే నిర్ణయానికి వచ్చారట విజయసాయి రెడ్డి. దీనిలో భాగంగా ప్రాంతాలవారీగా త్వరలోనే సన్నాహాక సమావేశాలు పెట్టడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలుస్తోంది. కొత్త పార్టీపై శ్రావణమాసంలో అధికారికంగా ప్రకటన చేయడానికి విజయసాయి సిద్ధమవుతున్నట్టు సమాచారం. ఈ కొత్త పార్టీ ఏర్పాటు విషయంలో లెక్కల మాస్టారు ఆచితూచి అడుగులు వేస్తున్నట్టు చెబుతున్నారు. జెండాను, అజెండాను కేర్‌ఫుల్‌గా డిజైన్ చేస్తున్నారట. మోదీని ఆదర్శంగా తీసుకుని రాజకీయం చేయనున్నారట విజయసాయి. ఇక జెన్-జీ టార్గెట్‌గా పాలిటిక్స్ ఉంటాయని సమాచారం. జెన్-జీని ఆకట్టుకునే అజెండా, వ్యూహాలు రూపొందిస్తారట. దానిలో భాగంగా పార్టీలో యువతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తారని సమాచారం. రాబోయే ఎన్నికల్లో పార్టీ టికెట్లలో ఎక్కువభాగం వాళ్లకే అని చెబుతున్నారు. ఇక తమిళనాడు ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన విజయ్‌ను కూడా విజ యసాయి స్ఫూర్తిగా తీసుకున్నట్టు తెలుస్తోంది. విజయ్ తరహాలో డబ్బు లేని రాజకీయంపై ఫోకస్ పెట్టనున్నారట. ఇక హిందుత్వం సెంట్రిక్‌గా సాగే విజయసాయి రాజకీయంలో?సమానత్వం, కులాలకు అతీతంగా సామాజిక న్యాయం అంశాలను పొందుపరిచారట. యువత, మహిళలు, రైతులను ఆకర్షించేలా పార్టీ విధానాలు ఉంటాయని చెబుతున్నారు. పార్టీకి బూస్టప్ ఇచ్చేందుకు, విజయసాయిరెడ్డి త్వరలో పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

# మళ్లీ పాత నియోజకవర్గాల కోసం డిమాండ్

విజయవాడ, ఆగస్టు 8, వైసీపీ నేతలు తమ పాత నియోజకవర్గాలను కేటాయించాలని పార్టీ హైకమాండ్ పై వత్తిడి తెస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలంటే ఖచ్చితంగా కూటమి పార్టీలకు గట్టి పోటీని ఇవ్వాలంటే తమకు పాత నియోజకవర్గాలకు పంపాలని కోరుతున్నారు. ఈ వాయిస్ ఇటీవల కాలంలో పార్టీ అధినేత జగన్ వద్ద ఎక్కువగా వినిపిస్తుంది. జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు కానీ, తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయంలో సమావేశమయినప్పుడు కానీ ఇదే విషయాన్ని పదే పదే ప్రస్తావిస్తున్నారట. తమకు ఇష్టం లేని, పరిచయాలు లేని నియోజకవర్గాల్లోనే కొనసాగిస్తే లోకల్ బాడీ ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికరమైన పరిస్థితులుంటాయని హెచ్చరిస్తున్నారట. తర్వాత తమను నిందించి, ఓటమిని తమ ఖాతాల్లో వేయవద్దని కోరుతున్నట్లు తెలిసింది. 2024 ఎన్నికలకు వైసీపీ అనేక ప్రయోగాలు చేసింది. అందులో ఒకటి మంత్రులతో పాటు ఎమ్మెల్యేలను వారి సొంత నియోజకవర్గాల నుంచి తప్పించి కొత్త నియోజకవర్గాలకు అభ్యర్థులుగా పంపింది. కొత్త అభ్యర్థులయితే.. స్థానికంగా ఉండే అసంతృప్తి నుంచి బయటపడి గెలవచ్చని నాడు జగన్ తీసుకున్న నిర్ణయం ఫలించలేదు. ఒకరకంగా చెప్పాలంటే ఆ బదిలీ వ్యూహం వికటించిందనే చెప్పాలి. మంత్రులుగా ఉన్న విడదల రజని, తానేటి వనిత, మేకపాటి సుచరిత, ఆదిమూలం సురేష్, అనిల్ కుమార్ యాదవ్, వెల్లంపల్లి శ్రీనివాస్ తో పాటు అనేక మంది ఎమ్మెల్యేలను మార్చి జగన్ నాడు పెద్ద ప్రయోగమే చేశారు. కానీ ఇష్టం లేకుండానే అక్కడకు వెళ్లిన నేతలు దాదాపుగా అందరూ ఓటమి పాలయ్యారు. వైసీపీకి కేవలం పదకొండు స్థానాలకే పరిమితమై ప్రతిపక్ష కూడా హోదా దక్కకపోవడానికి ఈ మార్పిడి నిర్ణయమూ ఒక కారణమంటున్నారు... దీంతో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లోజరగనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో గెలవాలంటే తమ పాత నియోజకవర్గాలకు పంపాలని వైసీపీ నేతలు నాయకత్వానికి మొర పెట్టుకుంటున్నారు. కానీ జగన్ మాత్రం ఇప్పటి వరకూ దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయం ముంచుకొస్తుండటంతో జగన్ విజయవాడ వచ్చినప్పుడల్లా కలసి తమ బాధను చెప్పుకుంటున్నారు. అయితే నవ్వడం మినహా జగన్ నుంచి నిర్ణయం వెలువడక పోవడంతో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొత్త నియోజకవర్గాల్లో ఓటమి తర్వాత ఆ నేతలు క్యాడర్ కు దూరంగా ఉంటూ వస్తున్నారు. అలాగే తమకు బలం ఎక్కడ ఉంది? ఎక్కడ ప్రతిపక్షం బలంగా ఉందన్న విషయం తెలియదని, అందుకే తమకు ఓల్డ్ ఈజ్ గోల్డ్ అని చెబుతున్న నేతల మొర జగన్ పట్టించుకుంటారా? లేదా? అన్నది చూడాలి.

**గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం**

వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా వైసీపీ వ్యూహం మార్చిందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో వైసీపీ నేతల వ్యాఖ్యలతో పాటే, నిరసనలు, ఆందోళనల్లో వినిపిస్తున్న ఆ పేరే.. దీనికి బలం చేకూరుస్తోంది. తాజాగా డీఎస్సీ అక్రమాలపై చేపట్టిన రిలే నిరాహార దీక్షా శిబిరాలపై దాడులు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వైసీపీ అధినేత వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌లోనూ ఇదే పదం కనిపించడంతో.. రాజకీయ నిపుణులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వ్యూహం మార్చిందా.. ఢిల్లీ ప్రభావం ఏపీలోని గల్లీపైనా పడిందా.. అంటే అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంపై ఢిల్లీ వేదికగా సాగిన జెన్ జీ ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి.. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో రాజీనామాచేయించింది కూడా. ఈ ఉద్యమంతో రాజకీయాల్లో జెన్ జీ పాత్ర ఏమిటనే దానిపై పొలిటికల్ పార్టీలకు ఓ క్లారిటీ వచ్చింది. దీంతో అన్ని పార్టీలు కూడాజెన్ జీలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. వారి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడుతున్నాయి. ఈ క్రమంలోనే ఏపీలోని యువతరాన్ని తమవైపు ఆకర్షించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. యువత, విద్యార్థుల సమస్యలను లేవనెత్తుతోంది. నీట్ తరహాలోనే ఏపీలో డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీ ఆరోపిస్తోంది. జెన్ జీ ఉద్యమం ముందు వరకూ డీఎస్సీలో అక్రమాలపై వైసీపీ సాగించిన పోరాటం.. ప్రధాన్ రాజీనామా అనంతరం దేశవ్యాప్తంగా మారిన పరిస్థితుల కారణంగా కొత్త రూపు తీసుకుంది. వైసీపీ చేసే నిరసన కార్యక్రమాలు, ఆందోళనలలోనూ జెన్ జీ పేరును వైసీపీ నేతలు ఎక్కువగా ప్రచారంలోకి తీసుకువస్తున్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇటీవల పొగాకు రైతులను పరామర్శించేందుకు తూర్పుగోదావరి జిల్లా దేవరాపల్లిలో పర్యటించారు.జగన్ పర్యటనకు జెన్ జీల నుంచి అనూహ్య స్పందన వచ్చిందని... యువతరం పెద్ద సంఖ్యలో జగన్ కార్యక్రమానికి హాజరయ్యారని వైసీపీ నేతలు సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇప్పుడు డీఎస్సీ అక్రమాలపై వైసీపీ చేపడుతున్న రిలే నిరాహార దీక్షల వద్ద జెన్ జీ ప్రస్తావన తేవడం మారిన వైసీపీ స్ట్రాటజీకి నిదర్శనమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

## వైజాగ్ వాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరినట్టే..
## ఆ 35 కూడళ్లలో సరికొత్తగా!

విశాఖపట్టణం, ఆగస్టు 8, వైజాగ్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ఇటీవల ఓ సర్వే కూడా నిర్వహించారు. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద అభివృద్ధి పనులు చేసి ట్రాఫిక్ సమస్యను రూపుమాపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత వైజాగ్ ప్రాంతం అభివృద్ధి బాట పట్టింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు కూడా ఈ ప్రాంతానికి రావడానికే మొగ్గు చూపుతున్నాయి. ఎయిర్‌పోర్ట్, నౌకాశ్రయం, స్టీల్‌ప్లాంట్ ఇలా అభివృద్ధికి కీలక మార్గాలన్నీ ఇక్కడే ఉండటంతో జనాభా పెరగడం, ట్రాఫిక్ సమస్య కూడా రోజురోజుకూ పెరుగుతూ వస్తోంది. దాతో ట్రాఫిక్ రద్దీకి జీవీఎంసీ చర్యలు చేపట్టింది.విశాఖ కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో జాతీయ రహదారిలో అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలు, వాహనాల సంఖ్య, తీసుకోవాల్సిన చర్యలపై జీవీఎంసీ ఇటీవల సర్వే చేపట్టింది. గాజువాక నుంచి కొమ్మాది వరకు అత్యంత క్లిష్టమైన కూడళ్లను పరిశీలించిన అధికారులు 35 కూడళ్ల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వచ్చారు.ఈ 35 కూడళ్లలో ప్రైవేట్ ఏజెన్సీతో ప్రణాళికలు రూపొందించి అమలు చేయడానికి జీవీఎంసీ సిద్ధమైంది. ఒక్కో కూడలిలో రూ. 1.5 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు వెచ్చించనున్నారు. ఇక్కడ ప్రధానంగా సర్వీసు రహదారి ఏర్పాటు చేయడం.. ప్రస్తుతం ఉన్న ఫ్రీ లెఫ్టులను మరింత అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.వెంకోజీపాలెం వద్ద హెచ్‌బీ కాలనీకి వెళ్లే రహదారి విస్తరించడం, విశాఖ వ్యాలీ కూడలి వద్ద మరో సర్వీసు రహదారి నిర్మించడం, ఎండాడ వద్ద సర్వీసు రహదారి అభివృద్ధి చేయడం వంటి ప్రతిపాదనలు అధికారులు తీసుకున్నారు. ఈ పనులను చేయడానికి త్వరలోనే టెండర్లను ఆహ్వానించనున్నారు. జీవీఎంసీ ప్రధాన ఇంజినీరు, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఈ ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై సమావేశం కూడా నిర్వహించారు.జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసుల బృందం సర్వే ఆధారంగా ఒక అవగాహనకు వచ్చి అభివృద్ధి పనులు చేయట్టాలని నిర్ణయించారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టనున్నారు.

# వచ్చే జనాలు ఓట్లుగా మారుతాయా

కాకినాడ, ఆగస్టు 8,వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కడకు వెళ్లినా జనం పోటెత్తుతున్నారు. ప్రాంతాలకు అతీతంగా ఆయనకు జేజేలు కొడుతున్నారు. కానీ ఆ జేజేలు ఓట్ల రూపంలో మారతాయా? అన్నది పెద్ద డౌటు. ఎందుకంటే జగన్ పర్యటనలకు వచ్చిన జనం ఎన్నికల సమయంలో ఓట్లు వేస్తారన్న గ్యారంటీ లేదు. జన సమూహాన్ని చూసి ఇక తాము గెలిచినట్లేనని వైసీపీ సీనియర్ నేతలు మాత్రం మురిసి పోవడం లేదు. ఎందుకంటే జగన్ కు ఇప్పటి నుంచి కాదు. 2012లో వైసీపీ పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ ఎక్కడ పర్యటనలకు వెళ్లినా వేలాది మంది వస్తున్నారు. స్థానిక నేతలు వారిని తరలిస్తున్నారా? లేక స్వచ్ఛందంగా తరలివస్తున్నారా? అన్నది పక్కన పెడితే వారిని చూసి గెలిచేస్తామనుకుంటే అంతకు మించిన వెర్రితనం మరొకటి ఉండదన్న కామెంట్స్ వినపడుతున్నాయి.మరో మెగా డీఎస్సీ.. ఎప్పుడంటే? బయటకు వస్తే చాలు... గత పథ్నాలుగేళ్ల నుంచి జగన్ బయటకు వస్తే చాలు.. అది ఏ పర్యటన అయినా.. ఏ ప్రాంతమయినా తండోపతండాలుగా తరలి వస్తున్నారు. కానీ జగన్ గెలిచింది కేవలం 2019 మాత్రమేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అన్నారు. జగన్ కు వచ్చే జనాలను చూసిన వారికి ఎవరికైనా ప్రతి ఎన్నికల్లో జగన్ గెలుస్తారని భావిస్తారు. కానీ 2014, 2024లోదారుణ ఓటమికి గల కారణాలను మాత్రం ఇప్పటికీ వైసీపీ అధినేత జగన్ తెలుసుకోలేకపోతున్నారని అంటున్నారు. అనేక అంశాలు ఎన్నికలలో ప్రభావితం చేయనున్నాయి. కేవలం జన బలం మాత్రమే కాదు. యాటిట్యూడ్, విధానాలు, అభ్యర్థి ఎంపిక వంటి అంశాలు కీలకంగా పనిచేస్తాయి. అంతే తప్ప జనం వచ్చినంత మాత్రాన గెలిచినట్లు కాదని, రానంత మాత్రాన ఓడినట్లు కాదని కొందరు ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. జగన్ పర్యటనల్లో జనసందోహాన్ని చూసిన వారు ఎవరైనా ఇంత ఫాలోయింగ్ ఏంటి సామి అని ఆశ్చర్యపడకమానరు. ఇటీవల కాలంలో ఆయన వరసగా పర్యటనలు చేస్తున్నారు. శ్రీకాకుళం, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల్లో జగన్ పర్యటనలు వైసీపీ నేతల మాటల్లో సూపర్ సక్సెస్ అయ్యాయి. నిజమే.. సూపర్ సక్సెస్ అయింది నిజమే కాని దాని వల్ల అధికారం లభిస్తుందా? అన్నది పెద్ద సందేహం. ఎందుకంటే ఎన్నికల్లో ఎలక్షనీరింగ్ ముఖ్యం. ఇందులో టీడీపీని కొట్టేవారు లేరు. ఒక స్కెచ్ ప్రకారం, చంద్రబాబు వ్యూహాల ప్రకారం ఎన్నికల వేళ ఫలితం తారుమారయ్యేటట్లు చేయగలరు. అందుకే జనాన్ని చూసి గెలిచామని ఊహించుకుని ఊహల లోకంలో విహరించడం కంటే ...క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ కమిటీలను బలోపేతం చేసుకోవడం, అభ్యర్థుల ఎంపిక సక్రమంగా చేయడం, ప్రత్యర్థుల ఎత్తులు ముందుగానే పసిగట్టి వాటికి పై ఎత్తులు వేస్తేనే గెలవగలమని ఉత్తరాంధ్ర సీనియర్ నేత ఆఫ్ ది రికార్డుగా వ్యాఖ్యానించడాన్ని ఎవరూ కాదనలేరు. ఈ విషయాన్ని జగన్ తెలుసుకుంటే మంచిదని అంటున్నారు.కొన్నిచోట్ల వైసీపీ పోస్టర్లపై జెన్జీ వార్ అంటూ ముద్రిస్తుండటం గమనార్హం. తాజాగా వైఎస్ జగన్ చేసిన ట్వీట్‌తో వైసీపీ వ్యూహం మారిందనే క్లారిటీ వచ్చిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.డీఎస్సీ అక్రమాలపై విజయవాడలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే, అతని అనుచరులు దాడి చేసి ధ్వంసం చేశారని జగన్ ఆరోపించారు.పోలీసుల కళ్లముందే, వారి సమక్షంలోనే టెంట్లు లాగిపడేశారని.. మా మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు యువతను లక్ష్యంగా చేసుకుని రాళ్లు, కోడిగుడ్లు, టమాటాలతో దాడి చేశారని జగన్ ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా చాలా చోట్ల నిరసన శిబిరాలపై దాడులు చేశారన్న జగన్.. ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కును నిరుద్యోగ యువతకు లేకుండా చేశారని ఆరోపించారు.దీక్షా శిబిరాలను ధ్వంసం చేసి, నిరసనకారులను అరెస్టు చేసి, నిరుద్యోగ యువతలో రగులుతున్న ఆగ్రహాన్ని అణచివేయలేరని.. ఆంధ్రప్రదేశ్ గొంతును మూయలేరంటూ జగన్ ట్వీట్ చేశారు. ఈ నేపథ్యంలో జగన్ ట్వీట్ 2029 ఎన్నికలకు వైసీపీ స్ట్రాటజీని తెలియజేస్తోందని పొలిటికల్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వైసీపీ నిరసనలు, ఆందోళన కార్యక్రమాల వైపు యువతరాన్ని ఆకర్షించి, వారి భాగస్వామ్యులను చేసుకుని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడమే కాకుండా వచ్చే ఎన్నికల్లో విజయఢంకా మోగించాలనే ఆలోచనలో ఉన్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు

# అక్టోబర్‌లో డీఎస్సీ నోటిఫికేషన్,
# డిసెంబర్ నెలలో పరీక్షలు.. విద్యాశాఖ ప్రకటన

విజయవాడ, ఆగస్టు 8, ఏపీలోని నిరుద్యోగ యువతకు గుడ్ న్యూస్. అక్టోబర్ నెలలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అక్టోబర్ నెలలో నోటిఫికేషన్ విడుదల, డిసెంబర్ నెలలో పరీక్షలు ఉంటాయని ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలకు సంబంధించి విద్యాశాఖ అధికారులు శుక్రవారం మరోసారి క్లారిటీ ఇచ్చారు. ఎంపికైన అభ్యర్థులు ఈ దుష్ప్రచారాన్ని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుభవార్త చెప్పింది. వచ్చే అక్టోబర్ నెలలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ఏపీ విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా తెలిపారు. డిసెంబర్‌లో డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మెగా డీఎస్సీపై వస్తున్న ఆరోపణల మీద ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం మరోసారి వివరణ ఇచ్చింది. అమరావతి సచివాలయంలో విలేకర్లతో మాట్లాడిన తమీమ్ అన్సారియా.. డీఎస్సీ 2025పై వస్తున్న ఆరోపణలను ఖండించారు. డీఎస్సీ 2025 ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశామని.. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో అత్యంత పారదర్శకంగా ప్రక్రియ నిర్వహించామన్నారు. అయినప్పటికీ డీఎస్సీ 2025పై నిరాధార ఆరోపణలు, దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు తప్పుడు ప్రచారాలు నమ్మవద్దని.. ఆందోళనకు గురికావద్దని సూచించారు.మరోవైపు 2025 డీఎస్సీపై వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటి వరకూ మూడుసార్లు వివరణ ఇచ్చామని.. అయినా కూడా దుష్ప్రచారం చేస్తుంటే మరోసారి క్లారిటీ ఇస్తున్నట్లు వివరించారు. హారిజాంటల్ రిజర్వేషన్ ప్రకారమే అర్హులకే పోస్టులు దక్కాయన్న తమీమ్ అన్సారియా.. ఏవైనా అనుమానాలు ఉంటే తమ వద్దకు రావాలని సూచించారు. 12 పద్ధతులను అనుసరించి డీఎస్సీ నిర్వహించామని.. డీఎస్సీ మెరిట్, సెలక్షన్ లిస్టును ఆన్ లైన్‌లో ఎప్పుడైనా చూసుకునే అవకాశం ఉందన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఆందోళనకు గురికావొద్దని.. ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని తమీమ్ అన్సారియా తెలిపారు. ఉద్యోగాలు రాని అభ్యర్థులు.. ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మకుండా వచ్చే డీఎస్సీపై దృష్టిపెట్టాలని తమీమ్ అన్సారియా సూచించారు.మరోవైపు స్పోర్ట్స్ కోటా టీచర్ల నియామకాలపై ఏపీ స్పోర్ట్స్ అథారిటీ వైస్ చైర్మన్ భరణి స్పందించారు. అన్ని ఫెడరేషన్లు, స్పోర్ట్స్ అసోసియేషన్లు నుంచి పూర్తి వివరాలు సేకరించామని, ప్రతి అభ్యర్థి ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించామని వివరించారు. ఆ తర్వాతే ప్రిలిమినరీ ప్రాధాన్యత జాబితాను రూపొందించి విద్యాశాఖకు పంపినట్లు భరణి క్లారిటీ ఇచ్చారు. మరోవైపు డీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ వైసీపీఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రిలే నిరాహార దీక్షలు కూడా చేపట్టింది

# మున్సిపల్, పంచాయతీ ఎన్నికలు

## ఓటుకు ఈవీఎంలా.. బ్యాలట్ బాక్సులా?

ఒంగోలు ఆగస్టు 8, స్థానిక సంస్థల ఎన్నికల నగారా అతి త్వరలో మోగనుంది. దీనిపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో సమావేశమయ్యారు. 2021లో జరిగిన తీరును, ఇప్పుడు జరగనున్న విధానంపై చర్చించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని వీలైనంత త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అదేవిధంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? లేక ఈవీఎంలు వాడాలా? అన్న విషయంపై కూడా అధికారులు చర్చించారు. ఎన్నికల తేదీ వచ్చేలోపే అంతా సిద్ధం చేసుకోవాలని ఎన్నికల కమిషనర్ ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏ క్షణమైనా మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నగారా మోగొచ్చని.. అధికారులు సిద్ధంగా ఉండాలంటూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అలర్ట్ చేశారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు చేసిన ఏర్పాట్లపై ముఖ్య అధికారులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పెండింగ్‌లో ఉన్న అంశాలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై పురపాలక, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు వినియోగించాలా, ఈవీఎంలు వాడాలా అనే అంశంపై కూడా చర్చించారు.రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగర పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ చెప్పారు. కొన్ని చోట్ల కోర్టు కేసులు ఉన్నందున వాటిని పరిష్కరించే దిశగా కూడా చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చీఫ్ సెక్రటరీ వివరించారు. పెండింగ్‌లో 23 కోర్టు కేసులు ఉంటే వాటిల్లో నాలుగు పరిష్కారమయ్యాయి అని తెలిపారు.ఇక పంచాయతీల విషయానికి వస్తే రాష్ట్రంలో మొత్తం 13,359 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 2021లో 354 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండే ఒక ప్రజంటేషన్ కూడా ఇచ్చారు. పురపాలకశాఖతో సమన్వయం చేసుకుని పెండింగ్ కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఓటర్ల తుది జాబితా ప్రచురణ, పోలీస్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపైనా సిబ్బందిని సన్నద్ధం చేస్తున్నామని అధికారులు తెలిపారు.ఈ ఎన్నికలకు బ్యాలట్ బాక్సులు ఉపయోగించాలా? ఈవీఎంలు వాడాలా? అనే అంశంపై కూడా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అధికారులతో చర్చించారు. జిల్లాల వారీగా ఎన్ని బ్యాలట్ బాక్సులు ఉన్నాయి, ఎన్ని ఈవీఎంలు ఉన్నాయి అనే వివరాలను అధికారులు నివేదించారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రూ. 3.5 కోట్ల వరకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించగా.. ఈ ఏడాది ఎంత బడ్జెట్ అవుతుందో కూడా చర్చించారు

# అనంతపురం పాలిటిక్స్ హీట్..

# జేసీ వర్సెస్ కేతిరెడ్డి

అనంతపురం, ఆగస్టు 8,అనంతపురం జిల్లా పెద్దవడుగూరులో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీల పోటాపోటీ కార్యక్రమాలతో రాజకీయ ఉత్కంఠ పీక్స్‌కు చేరింది. డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయంటూ వైసిపి శ్రేణులు రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే వైసిపి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పెద్దవడుగూరులో ఒక భారీ నిరసన దీక్ష చేపట్టేందుకు అన్ని సన్నాహాలు చేసుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే టీడీపీ సీనియర్ నేత, తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి సైతం అదే నియోజకవర్గ పరిధిలోని పెద్దవడుగూరులో స్థానిక టీడీపీ కార్యకర్తలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేయడం రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేపుతోంది.ఒకే లొకేషన్‌లో అటు ప్రతిపక్ష వైసీపీ నిరసన దీక్ష, ఇటు అధికార టీడీపీ కీలక నేత జేసీ ప్రభాకర్ రెడ్డి సమావేశం ఒకేసారి జరగనుండటంతో పెద్దవడుగూరులో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇరు పార్టీల క్యాడర్ భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక పోలీస్ యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు పట్టణంలోని ముఖ్య కూడళ్లలో భారీగా పోలీసు బలగాలను మోహరించి నిఘా పెట్టారు. డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న అక్రమాల ఆరోపణలను తిప్పికొట్టేలా టీడీపీ నేతలు వ్యూహాలు రచిస్తుండటంతో తాడిపత్రి పాలిటిక్స్ మరోసారి హీటెక్కాయి.రాజకీయంగా ఎప్పుడూ సెన్సేషనల్ గా ఉండే తాడిపత్రి నియోజకవర్గంలో జేసీ ప్రభాకర్ రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డిల తాజా కదలికలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ నిరసన దీక్షకు పోలీసులు అనుమతి ఇస్తారా, లేదా అనే ఉత్కంఠ నడుస్తుండగానే ఇరు వర్గాలు సవాల్ ప్రతిసవాళ్లకు దిగడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. ఒకే చోట జరుగుతున్న ఈ రెండు భిన్నమైన పొలిటికల్ యాక్టివిటీస్ రాబోయే గంటల్లో ఎలాంటి మలుపులు తిరుగుతాయోనని జిల్లా వ్యాప్తంగా సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ ఉద్రిక్త పరిస్థితులను అదుపు చేయడానికి పోలీసులు ఇరు పార్టీల ముఖ్య నేతలను ముందస్తుగా హౌస్ అరెస్ట్ చేసే అవకాశాలు కూడా ఉన్నట్లు స్థానిక వర్గాల నుండి సమాచారం అందుతోంది.

# తెరపైకి మంత్రివర్గ ప్రక్షాళన

విజయవాడ, ఆగస్టు 8, రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి మంత్రివర్గ ప్రక్షాళన అంశం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యాక ప్రభుత్వం కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశం ఉందనే ప్రచారం అధికార వర్గాలు, రాజకీయ విశ్లేషకుల మధ్య జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల మంత్రులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పనితీరుపై స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ వ్యాఖ్యలను భవిష్యత్‌లో జరిగే మంత్రివర్గ మార్పులకు సంకేతాలుగా పలువురు విశ్లేషిస్తున్నారు.ప్రస్తుతం ప్రభుత్వం స్థానిక ఎన్నికలను అత్యంత కీలకంగా భావిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి మంత్రి ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత సమర్థంగా తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు సమాచారం. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు స్పష్టమైన అవగాహన కల్పించడంతో పాటు ప్రతిపక్ష విమర్శలకు వెంటనే సమాధానం ఇవ్వాలని ఆయన సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం చేసిన పనులు ప్రజలకు చేరకపోతే ఆశించిన రాజకీయ ఫలితాలు రావని ఆయన స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.ముఖ్యంగా కొన్ని శాఖల్లో నిర్ణయాల అమలు ఆశించిన స్థాయిలో లేకపోవడం, ఫైళ్ల పరిష్కారంలో జాప్యం కనిపించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో వేగం తగ్గడం వంటి అంశాలపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాఖలపై పూర్తి పట్టు సాధించి ఫలితాలు చూపించాల్సిన అవసరం ఉందని ఆయన మంత్రులకు సూచించినట్లు సమాచారం. ప్రతి అంశంలో ముఖ్యమంత్రి జోక్యం అవసరం లేకుండా ఆయా శాఖల మంత్రులే ముందుండి పనిచేయాలని స్పష్టమైన సందేశం ఇచ్చినట్లు తెలుస్తోంది.జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రుల బాధ్యతల విషయంలో కూడా సీఎం ప్రత్యేకంగా ప్రస్తావించినట్లు సమాచారం. జిల్లాల్లో పార్టీ నాయకుల మధ్య సమన్వయం పెంచడం, అంతర్గత విభేదాలను తగ్గించడం, స్థానిక స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని ఆయన సూచించినట్లు చెబుతున్నారు. నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంపై తన దృష్టికి ఫిర్యాదులు వచ్చినట్లు కూడా ఆయన ప్రస్తావించినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.స్థానిక ఎన్నికల్లో కూటమి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందుకోసం ప్రతి మంత్రి క్షేత్రస్థాయిలో చురుకుగా వ్యవహరించాలని సీఎం ఆదేశించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ఫలితాల తర్వాత మంత్రుల పనితీరును సమగ్రంగా సమీక్షించి అవసరమైతే కేబినెట్‌లో మార్పులు చేపట్టే అవకాశాన్ని కూడా పరిశీలించవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.అయితే ఇప్పటివరకు మంత్రివర్గ విస్తరణ లేదా ప్రక్షాళనపై ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

అయినప్పటికీ ఇటీవల జరిగిన సమీక్షలు, సీఎం చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పనితీరుకు ప్రాధాన్యం పెరగనున్నదనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

స్థానిక ఎన్నికల అనంతరం రాజకీయ పరిస్థితులు ఎలా మారుతాయనే అంశాన్ని బట్టి కేబినెట్‌లో మార్పులపై స్పష్టత వచ్చే అవకాశముందని పరిశీలకులు భావిస్తున్నారు. ప్రస్తుతం ఈ అంశమే రాష్ట్ర రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది.

# భారత్, ఫ్రాన్స్ రఫేల్ డీల్

న్యూఢిల్లీ, ఆగస్టు 8, భారత ఎయిర్‌ఫోర్స్ యుద్ధ విమానాల కొరతను తీర్చడానికి ఫ్రాన్స్ సమర్పించిన రూ.3.25 లక్షల కోట్ల రఫేల్ ప్రతిపాదన కేవలం కొనుగోలు ఒప్పందం మాత్రమే కాదు. ఇది మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ దిశగా ముఖ్యమైన అడుగు. 114 జెట్లలో 94 దేశంలోనే తయారు చేస్తామని ఫ్రాన్స్ తెలిపింది. దీంతో టెక్నాలజీ బదిలీ, స్థానిక ఉత్పత్తి, పరిశ్రమలకు భారీ అవకాశాలు కలుగుతాయి.ఫ్రాన్స్ ప్రతిపాదన ప్రకారం మొత్తం 114 రఫేల్ జెట్లలో 94 భారత్‌లోనే ఉత్పత్తి అవుతాయి. కొన్ని విమానాలు ఫ్లై?అవే కండిషన్‌లో వస్తాయి, మిగతావి దేశీయ భాగస్వామ్యంతో తయారవుతాయి. ఇది గత రఫేల్ ఒప్పందాలకు భిన్నంగా, మొట్టమొదటిసారి రఫేల్‌ను ఫ్రాన్స్ వెలుపల పెద్ద ఎత్తున తయారు చేయబోతోంది. టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ ద్వారా ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్లు, అవియోనిక్స్‌లో స్థానిక కంటెంట్ 60 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల భారత్ స్వయంప్రతిపత్తి పెరుగుతుంది, భవిష్యత్తులో సొంత యుద్ధ విమానాల అభివృద్ధికి అనుభవం లభిస్తుంది.ఈ ఒప్పందం ఆమోదమైతే భారతీయ కంపెనీలకు దాదాపు రూ.1.6 లక్షల కోట్ల వ్యాపారం వస్తుందని అంచనా. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, లార్సెన్ ? టూబ్రో వంటి సంస్థలు ఎయిర్‌ఫ్రేమ్, ఇంజిన్ అసెంబ్లీ, అవయోనిక్స్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌లో పాల్గొంటాయి. ఫ్రెంచ్ కంపెనీలు డసాల్ట్, సఫ్రాన్, థేల్స్, ఎంబీడీఏ భారత భాగస్వాములతో కలిసి పనిచేస్తాయి. ఇది ఏరోస్పేస్ సప్లై చైన్‌ను బలోపేతం చేసి, ఉపాధి సృష్టి, నైపుణ్య అభివృద్ధికి దోహదం చేస్తుంది. స్థానిక ఆయుధాలు ఇంటిగ్రేట్ చేసుకునే అవకాశం కూడా ఉంది.రఫేల్ విడిభాగాల తయారీ కేంద్రం హైదరాబాద్‌లో ఏర్పాటవుతుంది. ఇప్పటికే టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో ఫ్యూజ్‌లేజ్(ఫ్యూస్‌లేజ్) తయారీ ఒప్పందాలు ఉన్నాయి. ఇది హైదరాబాద్‌ను ఏరోస్పేస్ హబ్‌గా మరింత బలపరుస్తుంది. ఇంజన్ మెయింటెనెన్స్, రిపేర్, ఓవర్‌హాల్(ఎంఆర్‌వో) సౌకర్యాలు కూడా ఇక్కడే రావచ్చు. దీనివల్ల తెలంగాణలో ఉపాధి, పెట్టుబడులు పెరుగుతాయి.భారత వాయుసేన స్క్వాడ్రన్ల సంఖ్య తగ్గుతున్న నేపథ్యంలో ఈ జెట్లు ముఖ్యం. ప్రస్తుతం ఉన్న 36 రఫేల్‌లకు జోడించి మొత్తం సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. 4.5 జనరేషన్ మల్టీ?రోల్ సామర్థ్యం, ఆధునిక ఆయుధ వ్యవస్థలు శత్రు దేశాలపై నిరోధక శక్తిని పెంచుతాయి. టెక్నాలజీ బదిలీతో భవిష్యత్తు స్వదేశీ విమానాల అభివృద్ధికి కూడా సహాయపడుతుంది.ప్రతిపాదనను రక్షణ శాఖ, వాయుసేన పరిశీలిస్తున్నాయి. ధర, టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ స్థాయి, ఇండిజీనస్ కంటెంట్, ఆయుధాల ఇంటిగ్రేషన్‌పై చర్చలు జరుగుతాయి. ఒప్పందం ఆమోదమైతే పూర్తి ప్రయోజనాలు వస్తాయి. ఈ ప్రతిపాదన భారత్ రక్షణ సామర్థ్యం పెంచడంతోపాటు ఆర్థిక, పారిశ్రామిక లబ్ధిని కలిగిస్తుంది. భారత్?ఫ్రాన్స్ రక్షణ సహకారంలో కొత్త అధ్యాయం మొదలవుతుంది.

## విజయ డెయిరీ చైర్మన్ పదవికి చలసాని రాజీనామా

విజయవాడ విజయ డెయిరీ ఛైర్మన్ పదవికి చలసాని ఆంజనేయులు రాజీనామా చేసారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే రాజీనామా చేసారు. రెండు గంటల పాటు ఆసుపత్రిలో చలసాని ఆంజనేయులుతో మంత్రులు కొల్లు రవీంద్ర,కొలుసు పార్థసారథి చర్చించారు. పార్టీ ఆదేశాలతో చలసాని ఆంజనేయులు రాజీనామా చేశారని మంత్రి పార్థసారథి ప్రకటించారు. చలసాని గత 7 సంవత్సరాలుగా విజయ డెయిరీ చైర్మన్గా కొనసాగారు. రెండ్రోజుల క్రితం మళ్లీ చైర్మన్గా ఏకగ్రీవ ఎన్నిక అయ్యారు. తాజాగా రాజీనామా చేసారు.

## గచ్చిబౌలి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

### ఇద్దరు అక్కడికక్కడే మృతి

రంగారెడ్డి గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్ సర్వీసు లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. తవేరా కారు నియోపోలిస్ బ్రిడ్జ్ పిల్లర్ను ఢీకొట్టింది. ఇద్దరు టైల్స్ కార్మికులు దుర్మరణం పాలయ్యారు. మృతులు రాజస్థాన్కు చెందిన కన్హయాలాల్ (25), దేరామ్ (24)గా గుర్తించారు. అతివేగమే ప్రమాదానికి కారణం. కారు కంట్రోల్ తప్పి పిల్లర్ను ఢీకొట్టినట్లు గుర్తించారు. ఇంద్రారెడ్డి నగర్ నుంచి నానక్రామ్గూడ వెళ్తుండగా శుక్రవారం అర్ధరాత్రి గంటలకు ఘటన జరిగింది.

## నడిరోడ్డుపై ఆగిపోయిన 108 అంబులెన్స్

### మరో అంబులెన్స్ వచ్చే వరకు రోగికి నరకయాతన

రాజన్న సిరిసిల్ల గంభీరావుపేట మండలం లక్ష్మీపూర్ తండాలో ఇంట్లో జారిపడి భూక్య జెమిలి(85) అనే వృద్ధురాలి కాలికి గాయం అయింది. 108 అంబులెన్స్ వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని రోడ్డుపై ఒక్కసారిగా వాహనం ఆగిపోయింది. మరో 108 వాహనం వచ్చే వరకు ఇబ్బంది పడుతూ అదే వాహనంలో వృద్ధురాలు వుండిపోయింది. నొప్పితో విలవిల్లాడుతూ వృద్ధురాలు రోదించింది.

## బంజారాహిల్స్లో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్ 11 లోని ఓ భవనం సెల్లార్లో దారు వల వైన్ మార్ట్ స్టాక్ స్టోరేజ్ భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సెల్లార్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది 3 ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. చాలా సేపటివరకు మంటలు పూర్తిగా అదుపులోకి రాలేదు. సెల్లార్ నుంచి భారీగా పొగలు వెలువడ్డాయి. అగ్నిప్రమాదానికి గల కారణాలు, ఆస్తి నష్టం, ప్రాణనష్టంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## సర్పంచ్ భర్తను పరామర్శించిన చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి కరీంనగర్ జిల్లా గంగాధర మండలం నారాయణపూర్ గ్రామ సర్పంచ్ దీకొండ బాబాలక్ష్మి భర్త మధు అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ లోని వన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న చొప్పదండి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాస్పిటల్ కు వెళ్లి మధును శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మధు ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న చొప్పదండి మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ మెరుగైన వైద్యం అందించాలని దా" మహేశ్వర్ రెడ్డికి సూచించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పి, మధు త్వరగా కోలుకోని సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షించారు.మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు బీ ఆర్ ఎస్ నాయకులు ఉన్నారు.

## సరూర్ నగర్ స్టేడియం వద్ద తోపులాట

హైదరాబాద్ హైడ్రాలో హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలకు నిరుద్యోగులు పోటెత్తారు. దాంతో శనివారం ఉదయం సరూర్ నగర్ స్టేడియం దగ్గర తోపులాట జరిగింది. హైడ్రాలో 100 డీఆర్ఎఫ్, 50 హెవీ వెహికల్ డ్రైవర్ల పోస్టులకు ఎంపికలు సరూర్నగర్ స్టేడియంలో ఆగస్టు 8, 9 తేదీల్లో ఉదయం 5 గంటలకు ఈవెంట్స్ ఉంటాయని హైడ్రా ప్రకటించింది. పురుషులకు 800 మీటర్ల రన్నింగ్, 15 సెకన్లలో 100 మీటర్లు, లాంగ్ జంప్ 4 మీటర్లు, 6 మీటర్ల షాట్పుట్ (7.2 ఐఐ) ఈవెంట్లలో క్వాలిఫై అవ్వాలని ప్రకటించింది. దీంతో సరూర్నగర్ స్టేడియంలో జరిగే ఈవెంట్స్ పాల్గొనేందుకు భారీగా నిరుద్యోగులు పోటెత్తారు.

## ఫీజుల ఒత్తిడితో విద్యార్థి ఆత్మహత్య

కాకినాడ కళాశాల సిబ్బంది వ్యాఖ్యలతో తీవ్రమనస్థాపానికి గురైన ఓ ఇంటర్ విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కాకినాడ జగన్నాధపురం లోని జేరామారావుపేట సమ్మెట వారి వీధికి చెందిన పైల రాంబాబు జ్యోతి దంపతుల రెండో కుమారుడు పైల అరవింద్ 15 సంవత్సరాలు ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. శుక్రవారం అరవింద్ అతని తండ్రి ఇద్దరు కళాశాలకు వెళ్లినప్పుడు, చాలామంది సెకండ్ టర్న్ కూడా కట్టేశారని మీరు ఇంకా మొదటి టర్మ్ కట్టలేదని సిబ్బంది నలుగురు ముందు అనడంతో, వారు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు.

శుక్రవారం రాత్రి ఇంటి వద్ద ఎవరు లేని సమయంలో విద్యార్థి అరవింద్ ఫ్యాన్ కి ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. ఈ విషయమై కళాశాల ఉపాధ్యాయులు మరియు మీద కఠినంగా శిక్షించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు బంధువులు విద్యార్థులు కోరుతున్నారు.

# ఒంటరిగా బరిలోకి జనసేన

హైదరాబాద్, ఆగస్టు 8, తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. : తెలంగాణలో జనసేనతో పొత్తు లేదని బిజెపి సంకేతాలు ఇచ్చింది. ఢిల్లీ వేదికగా తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో ప్రత్యేక భేటీ జరిగింది. అయితే అక్కడే జనసేనతో పొత్తుపై చర్చ జరిగింది. అయితే జనసేనతో పొత్తు అనేది ఏపీకి మాత్రమే పరిమితం అని.. తెలంగాణలో లేదని క్లారిటీ ఇచ్చింది బిజెపి. దీంతో సొంతంగానే పోటీకి సిద్ధమవుతోంది జనసేన తెలంగాణలో. త్వరలో జరిగే గ్రేటర్ ఎన్నికలతో పాటు ప్రభావం చూపించగలిగిన జిల్లాల్లో ప్రాదేశిక ఎన్నికల్లో సైతం పోటీ చేయాలని చూస్తోంది జనసేన. అయితే ఉన్నట్టుండి బిజెపి జనసేన విషయంలో ఆ ఆలోచన చేయడానికి కారణం ఏంటనే ప్రశ్న వినిపిస్తోంది. భారత రాష్ట్ర సమితి తో బిజెపి పొత్తు ఉంటుందన్న పరిణామ క్రమంలోనే జనసేన ను దూరం పెట్టినట్లు తెలుస్తోంది. అయితే జనసేన మాత్రం ఒంటరి పోరాటానికి అన్ని ఏర్పాట్లు మొదలుపెట్టినట్లు సమాచారం.వాస్తవానికి ఏపీ మాదిరిగా తెలంగాణలో రాజకీయాలు ఉండవు. బిజెపి ఆది నుంచి స్వంతంగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. కానీ ఆశించిన స్థాయిలో ఆ ప్రయత్నాలు ఏవి ఫలించడం లేదు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం గట్టి ప్రభావం చూపింది. అధికార కాంగ్రెస్ పార్టీతో సమానంగా ఎనిమిది పార్లమెంట్ స్థానాలను తెచ్చుకుంది. అయితే బిజెపి అంతలా ప్రభావం చూపడానికి కారణం భారత రాష్ట్ర సమితి బలహీనం కావడమే. అయితే ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలపడలేదు. ఆ బలాన్ని భర్తీ చేయాలంటే భారత రాష్ట్ర సమితితో పొత్తు బిజెపికి అవసరం. అదే సమయంలో పూర్వవైభవం దిశగా అడుగులు వేయాలంటే ఓట్లతో పాటు సీట్లు పెంచుకోవడం భారత రాష్ట్ర సమితికి అవసరం. అందుకే ఆ రెండు పార్టీలు ఇప్పుడు పరస్పరం ఒక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది. జనసేన ను బిజెపి దూరం పెట్టడానికి అదే ప్రధాన కారణం అని ఢిల్లీ వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో మొన్న ఆ మధ్యన జరిగిన పరిణామాలు తెలియనివి కావు. పవన్ కళ్యాణ్ ను తెలంగాణ నుంచి కొంతమంది వ్యతిరేకించడం ప్రారంభించారు. దీంతో తెలంగాణలో కార్యకలాపాలు మొదలు పెట్టింది జనసేన. హైదరాబాదులో రాష్ట్ర కార్యాలయాన్ని కూడా ప్రారంభించారు. అయితే బిజెపితో పొత్తు ఉంటుందన్న తరుణంలోనే ఇలా చేస్తున్నారని అంతా భావించారు. కానీ భారతీయ జనతా పార్టీ ఆలోచన మరోలా ఉంది. అందుకే జనసేనతో పొత్తు విషయంలో క్లారిటీ ఇచ్చింది. కానీ ఏపీ అనుభవాల నేపథ్యంలో ఒంటరిగా ముందు పోటీ చేసి.. ఓట్ల శాతాన్ని పెంచుకుంటే ఇతర పార్టీలు పొత్తుకు ముందుకు వస్తాయని.. అందుకే ఒంటరిగా ముందుకు వెళ్లాలని జనసేన వర్గాలు ఒక నిర్ణయానికి వచ్చాయి. సెటిలర్స్ అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు అభిమానులు ఉన్నచోట పార్టీని మరింత బలోపేతం చేయాలని జనసేన భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

## తమిళ బడ్జెట్ లో విజయ్ హామీలకు నిధులు

చెన్నై, ఆగస్టు 8, ఈ ప్రభుత్వం ఎక్కువ రోజులు ఉండదు. అతుకుల బొంత. ఎప్పుడైనా కూలిపోవచ్చు. మధ్యంతర ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండండి. నమ్మకాన్ని కోల్పోవద్దు..ఇవి ఇటీవల డీఎంకే అధినేత స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు. అంతేకాదు విజయ్ గవర్నమెంట్ మీద.. గవర్నమెంట్ మీద ఆయన విమర్శలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడి కనీసం మూడు నెలలు కూడా పూర్తికాకముందే.. కొత్త ప్రభుత్వానికి ఆరు నెలలపాటు హనీమూన్ పీరియడ్ అనేది ఉంటుందని తెలిసి కూడా.. స్టాలిన్ విమర్శలు చేయడం మొదలుపెట్టారు. విజయ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించడం ప్రారంభించారు.ఎన్నికల సమయంలో నూతన వధువులకు 8 గ్రాముల బంగారం? పట్టు చీరలు.. ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన పిల్లలకు బంగారు ఉంగరాలు.. కాలేజీ విద్యార్థులకు లాప్టాప్ లు.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్.. వంటి హామీలను విజయ్ ప్రకటించారు. ఈ హామీలు అమలు చేయాలని.. నూతన వధువులకు బంగారం.. పట్టు చీరలు ఇచ్చే అవకాశం లేదని.. ప్రభుత్వం వీటిని నిలబెట్టుకోలేదని.. అనేక సందర్భాలలో స్టాలిన్ విమర్శించడం ప్రారంభించారు. ఈ విమర్శలకు టీవీకే నేతలు పెద్దగా స్పందించలేదు. విజయ్ కూడా రియాక్ట్ కాలేదు.టైం చూసి దెబ్బ కొట్టడం విజయ్ కి అలవాటు. సినిమాల్లో అయితే విలన్ ను ఎలా కొడతారో.. రియల్ లైఫ్ లో కూడా తన ప్రత్యర్థిని కూడా అలాగే విజయ్ దెబ్బ కొట్టాడు. తమిళనాడు బడ్జెట్లో విజయ్ తన తిరుగులేని వ్యూహాత్మకత విధానాన్ని ప్రదర్శించాడు.. ప్రతిపక్షాలు అంచనా వేయలేని విధంగా తమిళ ప్రజల మీద వరాల జల్లు కురిపించాడు. నూతన వధువులకు 8 గ్రాముల బంగారం.. పట్టుచీర అందించడానికి 912 కోట్లు కేటాయించింది విజయ్ ప్రభుత్వం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పుట్టే పిల్లలకు బంగారు ఉంగరం ఇచ్చేందుకు 560 కోట్లు కేటాయించింది. కాలేజీలలో చదువుకునే విద్యార్థులకు ల్యాప్టాప్ అందించడానికి 2000 కోట్లు కేటాయించింది.

# కాక్రోచ్ కు నిధులెలా వస్తున్నాయ్...

న్యూఢిల్లీ, ఆగస్టు 8,కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) గురించి రోజువారీగా కొత్త వివరాలు బయటకు వస్తున్నాయి. పార్టీ నాయకత్వం, దాని వ్యూహాలు, వెనుక ఉన్న శక్తులు, అసలు ప్రణాళిక ఏమిటి అన్న అంశాలపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ప్రముఖ నాయకుల వ్యక్తిగత జీవితాలు, ఆదాయ వనరులు, జీవన ప్రమాణాలు ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఉద్యమాలు నడిపే వారు సమాజానికి జవాబుదారులుగా ఉండాలని ఆశించే సందర్భంలో, వారి స్వంత నేపథ్యాలపై స్పష్టత లేకపోవడం చర్చకు దారితీస్తోంది.

సీజేపీ చీఫ్ అభిజిత్ దీప్కే గురించి అనేక ప్రశ్నలు వస్తున్నాయి. ఆయన తండ్రి మహారాష్ట్ర ప్రభుత్వ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తూ, నెలకు సుమారు 50 వేల నుంచి 60 వేల రూపాయల వేతనం పొందుతున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ శంభాజీనగర్‌లో ఉన్న ఆయన భవనం రెండు కోట్ల రూపాయలకు పైగా విలువైనదిగా అంచనా. ఆ ఇంట్లోని సదుపాయాలు, అక్కడ జరిగిన సమావేశాల్లో మద్యం సరఫరా విధానం, పెద్ద ఎత్తున కార్టన్ల రాకపోకలు వంటి వివరాలు చూస్తే, ఆదాయానికి తగిన జీవనస్థాయి లేదన్న సందేహం ఏర్పడుతోంది.అభిజిత్ అమెరికాలో చదువు, కోర్సు, సహచరులు, విశ్వవిద్యాలయం గురించి స్పష్టమైన సమాధానాలు ఇవ్వడం లేదు. ప్రశ్నలు వచ్చినప్పుడు "సమయం వచ్చినప్పుడు చెబుతాను" అని దాటవేస్తున్నారు. జార్ఖండ్ ఉద్యమానికి మద్దతు ఇవ్వలేనని జ్వరం కారణంగా చెప్పిన మరుసటి రోజే మహారాష్ట్రలో సమావేశం నిర్వహించి కోక్ తాగిన వివరాలు కూడా అసమతుల్యతను చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిధుల మూలం ఏమిటి, కుటుంబ ఆదాయంతో ఇంతటి జీవనశైలి ఎలా సాధ్యమవుతుంది అన్న ప్రశ్నలు సహజంగా తలెత్తుతున్నాయి.ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ నాయకురాలు నేహా బోరా 26 రోజుల పాటు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఆమె వయసు 29, గత 15 ఏళ్లుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు తెలిపారు. అంటే కౌమార దశ నుంచే వామపక్ష ఉద్యమాల్లో చురుకుగా ఉన్నట్లు అర్థం. అయితే చదువు, ఫీజులు, నిర్వహణ ఖర్చులు ఎవరు భరిస్తున్నారు, ఎలా జీవిస్తున్నారు అన్న విషయాల్లో స్పష్టత లేదు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తర్వాత ఆమె చేసిన నృత్యం, 20 నిమిషాలపాటు అనర్గళంగా మాట్లాడిన విధానం చూస్తే, దీర్ఘకాల నిరాహార దీక్ష చేసిన వ్యక్తి శారీరక స్థితికి సరిపోని ఉత్సాహం కనిపించింది. ఇలాంటి వైరుధ్యాలు ప్రజల్లో అనుమానాలను పెంచుతున్నాయి.సౌరభ్ దాస్ ఢిల్లీలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో నివసిస్తున్నారు. నెలకు పది లక్షల రూపాయల అద్దె ఉన్న ఇంట్లో ఉంటున్నారు. దీనిని ఆయన తిరస్కరించడం లేదు. ఇల్లు ఆయన పేరిట లేకపోయినా, ముగ్గురు ఉద్యోగులు, కారు సౌకర్యాలతో విలాసవంతంగా జీవిస్తున్నారు. ఉద్యమ కార్యకర్తగా ఇంతటి జీవనస్థాయి ఎలా సాధ్యమవుతుంది అన్నది మరో ముఖ్య ప్రశ్న.సీజేపీ రిజిస్టర్డ్ బాడీ కాదు. ఆర్ఎస్ఎస్‌ను రిజిస్టర్ చేయాలని కోరే వారు సీజేపీ విషయంలో అదే ప్రమాణాన్ని వర్తింపజేయకపోవడం గమనార్హం. ఉద్యమాలకు, సమావేశాలకు, ప్రయాణాలకు అవసరమైన నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి, నాయకులు ఎలా మనుగడ సాగిస్తున్నారు అన్న విషయాల్లో పారదర్శకత లేకపోవడం విమర్శలకు దారితీస్తోంది.ప్రజలను ప్రశ్నించే వారు తమ వ్యక్తిగత, ఆర్థిక విషయాల్లో కూడా స్పష్టంగా ఉండాలి. సైలెన్స్ లేదా దాటవేత ధోరణి అనుమానాలను మరింత పెంచుతుంది. సమాజం ఆశించేది సమాధానాలు, స్పష్టత, జవాబుదారీతనం. ఇవి లేకపోతే ఏ ఉద్యమమైనా విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంటుంది.

# కేబినెట్ ప్రక్షాళన కు లైన్ క్లియర్

హైదరాబాద్, ఆగస్టు 8, తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ పూర్తిస్థాయిలో కేబినెట్ కొలువుదీరలేదు. రెండు స్థానాలు ఇంకా ఖాళీగానే ఉన్నాయి. వీటిని ఎప్పుడు భర్తీ చేస్తారా.. అనే ఉత్కంఠ అందరిలోనూ నెలకొంది. ఈ నేపథ్యంలో కేబినెట్ విస్తరణపై అడుగులు ముందుకు పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. కొంతకాలంగా క్యాబినెట్‌ను పూర్తిస్థాయిలో పునర్వ్యవస్థీకరిస్తారనే ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ అధిష్టానం ఒక సురక్షితమైన మధ్యేమార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. అసంతృప్తులకు తావివ్వకుండా, కేవలం ఖాళీగా ఉన్న రెండు మంత్రి పదవులను మాత్రమే భర్తీ చేసి ప్రస్తుతానికి రాజకీయాన్ని చల్లబరిచేందుకు ఏఐసీసీ సిద్ధమైంది. వారం, పది రోజుల్లో, అంటే ఈ నెల 14వ తేదీ తర్వాత చిన్నపాటి విస్తరణపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.జులైలో ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగి రాష్ట్రంలోని పలువురు మంత్రులతో వరుసగా వ్యక్తిగత సమావేశాలు నిర్వహించారు. శాఖల పనితీరు, ప్రభుత్వంపై వస్తున్న విమర్శలు, నాయకుల మధ్య సమన్వయం, వివిధ పోర్ట్‌ఫోలియోలకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై ఆమె ఒక సమగ్ర నివేదికను రూపొందించారు. ఈ సమాచారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన అధిష్టానం, ప్రస్తుత దశలో సమూల మార్పులు చేపడితే ఎదురయ్యే ముప్పును ముందే ఊహించింది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో మంత్రుల రాజీనామాలు, తొలగింపుల వల్ల ఉత్పన్నమైన రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, తెలంగాణలో అలాంటి అలజడులకు ఆస్కారం ఇవ్వకూడదని నిర్ణయానికొచ్చింది. హైకమాండ్ సూచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి రెండు కీలక సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నారు. ఒకటి గిరిజన సామాజిక వర్గానికి, మరొక దాన్ని ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యం లేని రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఎస్టీ (లంబాడా) రేసులో గిరిజన సామాజిక వర్గానికి చెందిన రామచంద్ర నాయక్, బాలు నాయక్ లేదా దేవరకొండ ఎమ్మెల్యే పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. ఇక రెడ్డి సామాజిక వర్గం నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి వంటి సీనియర్లు తమ శాయశక్తులా ప్రయత్నాలు ముమ్మరం చేశారు. వీరితో పాటు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా చర్చల్లో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ముందే తనకు క్యాబినెట్‌లో చోటు కల్పిస్తామని అధిష్టానం హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన వర్గీయులు గుర్తు చేస్తున్నారు.ప్రస్తుత విస్తరణలో భారీగా పోర్ట్‌ఫోలియోలు మారుతాయా లేదా అనే అంశం పక్కన పెడితే, కొన్ని కీలక శాఖల్లో చిన్నపాటి మార్పులు ఉండే అవకాశం ఉందనే సంకేతాలు వెలువడుతున్నాయి. అయితే, మంత్రిపదవులు ఆశిస్తున్న నాయకుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో, పదవులు దక్కని వారి నుంచి ఎలాంటి ప్రతిఘటన లేదా బహిరంగ అసంతృప్తి రాకుండా చూడటమే రేవంత్ రెడ్డికి, హైకమాండ్‌కు ఉన్న అతిపెద్ద సవాలు. ఇందుకోసం తుది ప్రకటనకు ముందే ఆశావాహులతో వ్యక్తిగతంగా చర్చలు జరిపి, వారికి ఇతర నామినేటెడ్ లేదా పార్టీ పదవుల హామీలతో బుజ్జగించే వ్యూహాన్ని అమలు చేయాలని కాంగ్రెస్ నాయకత్వం యోచిస్తోంది. మొత్తానికి, పెద్ద ఎత్తున రీషఫుల్ చేసి లేనిపోని చిక్కులు కొనితెచ్చుకోవడం కంటే, రెండు ఖాళీలను భర్తీ చేస్తూ సామాజిక సమతుల్యతను కాపాడుకోవడమే ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణ కాంగ్రెస్‌కు రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుందని భావిస్తున్నారు. ఈ నెల 14 తర్వాత వచ్చే ఆ కీలక ప్రకటనతో కాంగ్రెస్ అంతర్గత రాజకీయ సమీకరణాలు ఏ మలుపు తిరుగుతాయో వేచి చూడాలి.

# ప్రకాష్ గౌడ్ ఫ్యామిలీ వార్

హైదరాబాద్, ఆగస్టు 8, రాజేంద్రనగర్ రాజకీయం వేడెక్కింది. అధికారం, కుటుంబ బంధాలు, వ్యక్తిగత వివాహ నిర్ణయాలు కలగలిసి ఒక సంచలనాత్మక పొలిటికల్ డ్రామాకు తెరలేపాయి. నియోజకవర్గంలో తిరుగులేని నాయకుడిగా గుర్తింపు పొందిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌కు సొంత ఇంట్లోనే ఊహించని సవాలు ఎదురైంది. ఆయన కుమారుడు సంతోష్ గౌడ్ నేరుగా తండ్రిపైనే తీవ్రస్థాయిలో తిరుగుబాటు బావుటా ఎగరవేసి, మీడియా ముందుకు రావడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ప్రజాప్రతినిధిగా అధికార పీఠంపై ఉన్న తండ్రికి, తన ప్రేమ వివాహానికి రక్షణ కోరుతున్న కుమారుడికి నడుమ సాగుతున్న ఈ పోరు ఇప్పుడు తెలంగాణలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ వివాదానికి మూలం సంతోష్ గౌడ్ ప్రేమ వివాహ నిర్ణయమే. రూపా రెడ్డి కుమార్తెను వివాహం చేసుకోవాలని నిశ్చయించుకున్నప్పటి నుంచి కుటుంబంలో తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. కేవలం వివాహాన్ని అడ్డుకోవడమే కాకుండా, తమకు మద్దతుగా నిలిచిన వారిపై భౌతిక దాడులు చేయిస్తున్నారని సంతోష్ నేరుగా ఎమ్మెల్యేపైనే సంచలన ఆరోపణలు చేశారు. ఇటీవల మణికొండలోని రూపా రెడ్డి నివాసంలో అపరిచిత వ్యక్తులు ప్రవేశించి సృష్టించిన అలజడి వెనుక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ హస్తం ఉందని, అంతర్గత ఆస్తి తగాదాలు, మనస్పర్థలే ఈ దాడులకు కారణమని ఆయన స్పష్టం చేశారు.అధికార వర్గాల ఒత్తిడి, పోలీసుల వైఖరిపై కూడా సంతోష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాణభయంతో అత్యవసరంగా డయల్-100 ద్వారా రక్షణ కోరినప్పటికీ, నార్సింగ్ పోలీసులు స్పందించిన తీరు అనుమానాస్పదంగా ఉందన్నారు. స్థానిక ప్రజాప్రతినిధి రాజకీయాధికారానికి పోలీసులు తలొగ్గారని, బాధితులకు న్యాయం చేయాల్సింది పోయి, రివర్స్‌లో తమపైనే అక్రమ కేసులు బనాయించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. నిజాలు బయటపెట్టినందుకు తమ ప్రాణాలకు మరింత ముప్పు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు.అటు బాధితురాలు రూపా రెడ్డి సైతం ఇది ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం జరుగుతున్న రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. తమను జైలుకు పంపించేందుకు ఎమ్మెల్యే వర్గం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని, ప్రశాంతంగా జీవించే తమ కుటుంబానికి పోలీసు ఉన్నతాధికారులు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అయితే, ఈ డ్రామాలో ఊహించని మలుపుగా రూపారెడ్డిని పోలీసులు చిట్టీల పేరుతో మోసాలకు పాల్పడ్డారనే కేసులో అరెస్టు చేయడం స్థానికంగా మరింత ఉత్కంఠను పెంచింది. ఇది పోలీసులపై వచ్చిన ఆరోపణల కవర్-అప్ చర్యనా లేక పాత కేసుల అమలులో భాగమా అనే చర్చ మొదలైంది.మరోవైపు ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శైలి వ్యూహాత్మకంగా ఉంది. వాడెవడో తనకు తెలియదని, ఈ వ్యవహారంతో తనకు ఎలాంటి సంబంధం లేదని ఆయన సింపుల్‌గా కొట్టి పారేశారు. సొంత కుమారుడి గుర్తింపునే ప్రశ్నించేలా వ్యాఖ్యానించడం ద్వారా ఈ వివాదం తీవ్రతను తగ్గించేందుకు ప్రయత్నించారా లేక సరైన సమయంలో పూర్తిస్థాయి సమాధానం చెప్పేందుకు సమయం తీసుకుంటున్నారా అనే కోణంలో విశ్లేషకులు భావిస్తున్నారు.మొత్తానికి రాజేంద్రనగర్ శాసనసభ్యుడి కుటుంబంలో రగులుకున్న ఈ నిప్పు, ఇప్పుడు తెలంగాణ వ్యాప్తంగా రాజకీయంగా పెద్ద దుమారాన్నే రేపుతోంది. అధికార బలం, కుటుంబ అంతర్గత వివాదాలు, పోలీసు వ్యవస్థ తీరు కలగలిసిన ఈ ఎపిసోడ్ రాబోయే రోజుల్లో ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

# 80 శాతం తగ్గిన గులాబీ విరాళాలు

హైదరాబాద్, ఆగస్టు 8, తెలంగాణలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. ఏడీఆర్ రిపోర్ట్ ప్రకారం.. ఆ పార్టీ ఫండ్స్ ఏకంగా 82 శాతం పడిపోయాయి. గతంలో రూ. 85 కోట్లు పొందిన బీఆర్ఎస్‌కు రూ.15 కోట్లకు పడిపోయింది. మరోవైపు.. ఎంఐఎం పార్టీ కూడా విరాళాలను సున్నాగా ప్రకటించింది. అంతేకాకుండా.. ఈ 2 పార్టీలు తమ విరాళాల నివేదికలను ఎన్నికల కమిషన్‌కు గడువు దాటిన తర్వాతే సమర్పించాయని నివేదిక స్పష్టం చేసింది.తెలంగాణ ఏర్పడిన తర్వాత దాదాపు 10 ఏళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి అధికారాన్ని కోల్పోయిన తర్వాత తీవ్ర ఆర్థిక ఎదురుదెబ్బ తగిలింది. విరాళాల సమీకరణలో బీఆర్ఎస్ గ్రాఫ్ ఒక్కసారిగా పడిపోయింది. పొలిటికల్ ఫండింగ్ డిస్‌క్లోజర్స్‌పై 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్' (ఏడీఆర్) విడుదల చేసిన నివేదిక ప్రకారం.. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న బీఆర్ఎస్ విరాళాలు గత ఏడాదితో పోలిస్తే ఏకంగా 82 శాతం క్షీణించాయి.2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 మంది దాతల

ద్వారా రూ. 85 కోట్ల విరాళాలు పొందిన బీఆర్ఎస్ పార్టీ.. ఇక 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేవలం 4 దాతల ద్వారా రూ. 15 కోట్లు మాత్రమే రాబట్టగలిగింది. దేశవ్యాప్తంగా విశ్లేషించిన ప్రాంతీయ పార్టీలన్నింటిలోనూ అత్యధికంగా నికర రూపంలో రూ. 70 కోట్ల మేర విరాళాలు కోల్పోయిన పార్టీగా బీఆర్ఎస్ నిలిచింది. గతంలో రద్దైన ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ. 495 కోట్లు రాబట్టి తెలుగు రాష్ట్రాల పార్టీల్లోనే అత్యధిక నిధులు పొందిన పార్టీగా రికార్డు సృష్టించిన బీఆర్ఎస్‌కు.. అధికారం పోయిన తర్వాత విరాళాల ప్రవాహం మందగించడం గమనార్హం.తెలంగాణకు చెందిన మరొక ప్రముఖ ప్రాంతీయ పార్టీ ఆల్ ఇండియా మజ్లిస్ ఎ ఇత్తేహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఎంఐఎం పార్టీ 2024-25 సంవత్సరానికి గాను రూ.20 వేల కంటే ఎక్కువ ఉన్న విరాళాలను సున్నాగా

ప్రకటించింది. కాగా.. 2023-24లో ఈ పార్టీ 16 విరాళాల ద్వారా రూ. 9 లక్షలు వచ్చినట్లు వెల్లడించింది. నేషనల్ లెవల్‌లో గత ఏడాది నిధులు ప్రకటించి.. ఈ ఏడాది రూ.20 వేలకు పైబడిన విరాళాలు సున్నాగా చూపిన 3 పార్టీల్లో ఎంఐఎం ఒకటిగా నిలిచింది.ఎన్నికల కమిషన్ నిర్దేశించిన గడువును పాటించడంలోనూ తెలంగాణ పార్టీలు విఫలం అయ్యాయి. 2023-24లో సరైన సమయానికే విరాళాల వివరాలను ఈసీకి సమర్పించిన బీఆర్ఎస్, ఎంఐఎం.. 2024-25కి సంబంధించి మాత్రం గడువు దాటిన తర్వాతే నివేదికలు ఇచ్చాయి. బీఆర్ఎస్ నిర్ణీత గడువు కంటే 9 రోజులు ఆలస్యంగా రిపోర్ట్ చేయగా.. ఎంఐఎం 28 రోజుల ఆలస్యంగా తన నివేదికను సమర్పించినట్లు ఏడీఆర్ నివేదిక స్పష్టం చేసింది.

# 100 ఎకరాల్లో బస్ డిపో

హైదరాబాద్, ఆగస్టు 8, హైదరాబాద్‌లో ట్రాఫిక్ పెరుగుతోంది.. ఎక్కడికక్కడే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు ఏర్పాటు చేసినా సరే ట్రాఫిక్ మాత్రం తగ్గడం లేదు. మెట్రో రైలుతో పాటుగా ఆర్టీసీ ప్రజా రవాణా అందుబాటులో ఉన్నా సరే ట్రాఫిక్ కష్టాలు మాత్రం కొనసాగుతున్నాయి. ప్రతిరోజూ నగరంలో వాహనాలకు తోడు తెలంగాణలోని ఇతర జిల్లాలతో పాటుగా ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు హైదరాబాద్‌కు వస్తున్నాయి. ముఖ్యంగా ఏపీతో పాటుగా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి ఆర్టీసీ బస్సులు నగరానికి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. ఆర్టీసీ బస్సుల కోసంఎంజీబీఎస్, జేబీఎస్ బస్ స్టేషన్‌లు ఉన్నాయి.. అయినా సరే ఒత్తిడి ఏమాత్రం తగ్గడం లేదు. అందుకే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్‌లో మరో బస్టాండ్ ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది.. టీజీఎస్‌ఆర్టీసీ 100 ఎకరాల్లో అత్యాధునిక బస్ టెర్మినల్‌ను ప్లాన్ చేసింది. తాజాగా ఈ డిపోకు సంబంధించి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు.తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ జగద్గిరిగుట్ట దగ్గర బస్ డిపో నిర్మాణం కోసం కుత్బుల్లాపూర్ మండలం గాజుల రామారం దగ్గర 100 ఎకరాలు కేటాయించినట్లు నితిన్ గడ్కరీ తెలిపారు. లోక్‌సభలో ఎంపీలు చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఈటల రాజేందర్ అడిగిన ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇచ్చారు. హైదరాబాద్ పరిధిలోని జగద్గిరిగుట్ట మీదుగా 28 జిల్లా బస్సులు, 47 సిటీ బస్సులు కలిపి రోజూ 404 ట్రిప్పుల వరకు తిరుగుతాయన్నారు. టీజీఎస్‌ఆర్టీసీ బస్ డిపో, టెర్మినల్ నిర్మాణం కోసం 99 ఏళ్లకు లీజుకు తీసుకోవడానికి హెచ్‌ఎంటీకి చెందిన స్థలాన్ని గుర్తించిందన్నారు.కానీ హెచ్‌ఎంటీ అధికారులు.. అంత సుదీర్ఘకాలం స్థలాన్ని లీజుకు ఇవ్వలేమని, 5 ఏళ్లకోసారి చొప్పున గరిష్ఠంగా 20 ఏళ్లకు మాత్రమే ఇస్తామని చెప్పారన్నారు. దీని

కోసం ఏటా రూ.6 కోట్ల లైసెన్స్ ఫీజు చెల్లించాలని చెప్పగా.. ఆ ప్రతిపాదనకు టీజీఎస్‌ఆర్టీసీ అంగీకరించలేదన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం టీజీఎస్‌ఆర్టీసీకి గాజులరామారం దగ్గర హెచ్‌ఎంటీ భూములకు సమీపంలో 100 ఎకరాలు కేటాయించినట్లు కేంద్రమంత్రి గడ్కరీ తెలిపారు. గాజుల రామారంలో ఏర్పాటు చేయబోయే డిపోలో ఇంటర్ స్టేట్ బస్సు సర్వీసుల కోసం ప్రత్యేకంగా బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. సిటీ బస్సుల కోసం మరో టెర్మినల్, ఎలక్ట్రిక్ బస్సుల కోసం ప్రత్యేక ఛార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే బస్సు కారణంగా ట్రాఫిక్ సమస్యలు రాకుండా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాలు, తెలంగాణలోని ఇతర జిల్లాల నుంచి వచ్చే బస్సులు ఈ డిపోకు వెళ్లనున్నాయి. అప్పుడు ఎలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు

# వివాదాల్లో మంచిర్యాల ఎమ్మెల్యే

అదిలాబాద్, ఆగస్టు 8, కొన్ని పత్రికల్లో ప్రచురితమైన అవినీతి , అక్రమాల కథనాలను మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తీవ్రంగా ఖండించారు. తన వ్యక్తిత్వ హననానికి, రాజకీయ ఎదుగుదలను అడ్డుకోవడానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన కొందరు రాజకీయ ప్రత్యర్థులు కుట్రపూరితంగా ఈ తప్పుడు ప్రచారాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో గానీ, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గానీ తాను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని.. ఇసుక, భూముల వ్యాపారాలకు ఎప్పుడూ దూరంగానే ఉన్నానని స్పష్టం చేశారు. ఆధారాలు లేకుండా తనపై అసత్య కథనాలు రాస్తున్న వ్యక్తులు, సంబంధిత పత్రికలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.ప్రధానంగా ప్రచారంలో ఉన్న రూ. 450 కోట్ల బ్యాంక్ రుణాల వ్యవహారంపై ఎమ్మెల్యే

పక్కా ఆధారాలతో క్లారిటీ ఇచ్చారు. 2009-10 కాలంలో సాయినాథ్ ప్రైవేట్ లిమిటెడ్, భాగ్యనగర్ హోటల్స్ పేర్లపై బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయని, అవి తాను సొంతంగా సృష్టించిన పత్రాలు కావని తెలిపారు. 2014 నుంచి 2025 వరకు కంపెనీ ద్వారా వినియోగించిన మొత్తం నిధులు రూ. 109 కోట్ల 11 లక్షలు మాత్రమేనని, అన్ని బ్యాంకులు కూడా అదే మొత్తాన్ని ఎన్‌పీఏ గా గుర్తించాయని వివరించారు. ఒకవేళ రూ. 450 కోట్ల మేర మోసమే జరిగి ఉంటే బ్యాంకులు కేవలం రూ. 109 కోట్లకు ఆస్తులను ఎలా వేలం వేస్తాయని ఆయన ప్రశ్నించారు.రుణ చెల్లింపులకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తూ, 2014 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంకులకు ఇప్పటికే రూ. 44 కోట్ల 81 లక్షలు చెల్లించామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆంధ్ర బ్యాంక్ ఖాతా ఎన్‌పీఏగా మారిన తర్వాత కూడా మరో రూ. 18 కోట్ల 72 లక్షలు చెల్లించామని, 2024 అక్టోబర్ 31 నుంచి నిరంతరంగా చెల్లింపుల ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు. వ్యాపారంలో ఎదురైన ఒడుదొడుకులను ప్రస్తావిస్తూ.. యూఎస్ ట్రేడింగ్ మార్కెట్ తీవ్ర పతనం కావడం వల్ల తాను వ్యక్తిగతంగా రూ. 160 కోట్ల మేర భారీ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చిందని, అయినప్పటికీ బాధ్యతాయుతంగా బ్యాంకు బకాయిలను తీరుస్తున్నట్లు చెప్పారు.తన సామాజిక, ప్రజా సేవలను గుర్తుచేస్తూ.. రాష్ట్రవ్యాప్తంగా సొంత నిధులతో 15 పాఠశాలలను నిర్మించి విద్యారంగానికి సహాయపడ్డానని ప్రేమ్ సాగర్ రావు తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తున్న నాయకులు ధైర్యముంటే ఎక్కడైనా బహిరంగ చర్చకు రావాలని, తాను పూర్తి ఆధారాలతో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై నిజానిర్ధారణ కమిటీ వేసినా, కమిటీ ముందుకు వచ్చి అన్ని పత్రాలు, సాక్ష్యాధారాలు సమర్పించేందుకు తాను వెనుకాడేది లేదని ప్రకటించారు. రాష్ట్ర కేబినెట్ విస్తరణలో తన పేరు మంత్రి పదవి రేసులోకి వచ్చిన ప్రతిసారీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కొందరు స్వపక్ష, విపక్ష నేతలు కావాలనే ఇటువంటి కుట్రలకు తెరలేపుతున్నారని ఎమ్మెల్యే తీవ్ర ఆరోపణలు చేశారు. గత పదేళ్లపాటు తీవ్ర ప్రతికూల పరిస్థితులలో, ప్రతిపక్షంలో ఉంటూ కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పోరాడిన తనపై ఇలాంటి నిరాధార ఆరోపణలు చేయడం తీవ్ర బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ రాజకీయ కుట్రల వెనుక ఉన్న అసలు సూత్రధారుల జాతకాలు బయటపడతాయని, నిజా నిజాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ప్రకటించారు.

## రేవంత లెక్కలోకి బనకచర్ల ప్రాజెక్ట్ రిజెక్ట్..

హైదరాబాద్, ఆగస్టు 8, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన పోలవరం?బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర పర్యావరణ శాఖకు చెందిన నిపుణుల అప్రైజల్ కమిటీ వెనక్కి పంపడంతో తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ వేడి ఒక్కసారిగా రాజుకుంది. ఈ పరిణామాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తమ నేత రేవంత్ రెడ్డి సాధించిన దౌత్యపరమైన విజయంగా ప్రచారం చేస్తుండగా, ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం ప్రాథమిక దశలోనే విఫలమైందంటూ ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. అయితే, ఈ రాజకీయ క్రెడిట్ వార్, ప్రతివిమర్శలకు ఆవల సాంకేతిక, చట్టపరమైన కోణాలను క్షుణ్ణంగా పరిశీలిస్తే, ఇది ఒకరికి లభించిన విజయమో లేదా మరొకరికి ఎదురైన ఓటమో కాదని.. నదీ జలాల చట్టాలకు అనుగుణంగా జరిగిన ఒక సహజ సిద్ధమైన పరిణామమని స్పష్టమవుతోంది.పర్యావరణ అనుమతుల ప్రక్రియను పరిశీలిస్తే, ఏ భారీ నదీ అనుసంధాన ప్రాజెక్టుకైనా ఒక స్పష్టమైన చట్టబద్ధమైన కార్యాచరణ ఉంటుంది. కేంద్ర జల సంఘం ద్వారా శాస్త్రీయంగా నీటి లభ్యత ధృవీకరణ పొందకుండానే పర్యావరణ అనుమతుల కోసం వెళ్లడం సాంకేతికంగా సరికాదు. చట్టబద్ధమైన ప్రాథమిక అనుమతులు లేకుండా ముందుకెళితే, భవిష్యత్తులో గ్రీన్ ట్రిబ్యునల్ లేదా సుప్రీంకోర్టు పరిధిలో పిటిషన్లు దాఖలై ప్రాజెక్టుపై శాశ్వత స్టే వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి కేంద్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరించి వెనక్కి పంపడం అనేది ప్రాజెక్టుకు మున్ముందు చట్టపరమైన చిక్కులు ఎదురుకాకుండా నిరోధించే ఒక ముందస్తు చర్యగా పరిగణించవచ్చు.గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ నిబంధనలు , అంతర్రాష్ట్ర ఒప్పందాల ప్రకారం ఎగువ , దిగువన ఉన్న ప్రతి ఒక్క రాష్ట్ర ప్రయోజనాలను రక్షించాల్సిన రాజ్యాంగ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. ఏపీ రూపొందించిన ప్రస్తుత ప్రాజెక్టు డిజైన్ ద్వారా తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు కూడా ముంపు ముప్పు, నీటి కేటాయింపులపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. గోదావరి బేసిన్ నుంచి సముద్రంలోకి వెళ్లే మిగులు, వరద నీటి పరిమాణాన్ని శాస్త్రీయంగా లెక్కించి, వాటాలపై స్పష్టత ఇచ్చే వరకు సీడబ్ల్యూసీ లేదా ఈఏసీ అనుమతులు మంజూరు చేయడం అంతర్రాష్ట్ర జల వివాదాల చట్టాలకు విరుద్ధమవుతుంది.రాజకీయంగా ఇది కూటమి ప్రభుత్వానికి బ్రేక్ పడటంలా అనిపించినప్పటికీ, సుదీర్ఘ కాలంలో ఈ ప్రాజెక్టుకు లభించే లీగల్ సెక్యూరిటీగా దీన్ని చూడవచ్చు. క్షేత్రస్థాయి ముంపు వివరాలు , నీటి కేటాయింపులపై పక్కా నివేదికలు లేకుండా ముందుకెళ్లడం వల్ల చట్టపరమైన పునాది బలహీనపడేది. పొరుగు రాష్ట్రాలతో సమగ్ర సంప్రదింపులు జరిపి, అంతర్రాష్ట్ర వివాదాలను పరిష్కరించుకున్న తర్వాతే సీడబ్ల్యూసీ నీటి లభ్యత ధృవీకరణ పత్రంతో మళ్లీ పర్యావరణ అనుమతులకు రావాలని కేంద్రం సూచించడం ద్వారా ప్రాజెక్టుకు ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ లభించింది.రాయలసీమ దాహార్తిని తీర్చేలా గోదావరి నుంచి 200 టీఎంసీల వరద నీటిని తరలించి, దాదాపు 80 లక్షల మందికి తాగునీరు, 3 లక్షల హెక్టార్లకు సాగునీరు అందించడం ఏపీకి అత్యంత ప్రాధాన్యమైన అంశం. ఇటువంటి మెగా ప్రాజెక్టు రూపుదిద్దుకోవాలంటే తొందరపాటు నిర్ణయాలు, పొలిటికల్ అజెండాల కంటే చట్టబద్ధమైన అడుగులే శ్రీరామరక్ష. సాంకేతిక లోపాలను సరిదిద్ది, అంతర్రాష్ట్ర సంప్రదింపులు పూర్తి చేసి చట్టబద్ధంగా ముందుకెళ్తేనే ఈ ప్రాజెక్టుకు శాశ్వత మనుగడ సాధ్యమవుతుంది.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పొలిటికల్ విక్టరీగా చూపుతున్నప్పటికీ, ఏపీ ప్రభుత్వం ఎదుర్కొన్నది సాంకేతిక ప్రతిబంధకాన్ని మాత్రమే గానీ ప్రాజెక్టు, రద్దును కాదు. కేంద్రం ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా సీడబ్ల్యూసీ నివేదికను సిద్ధం చేసుకుని, పొరుగు రాష్ట్రాల అభ్యంతరాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగితేనే పోలవరం?బనకచర్ల అనుసంధానం సుసాధ్యమవుతుంది. రాజకీయ విమర్శలను పక్కనపెట్టి, నిబంధనల ప్రకారం లీగల్ బ్యాకప్‌తో ఏపీ ప్రభుత్వం ముందడుగు వేయడమే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు భవిష్యత్తుకు అత్యంత సురక్షితమైన మార్గం.

## ప్లాన్ బీలో రేవంత్...

## కర్ణాటక ఎఫెక్ట్...

హైదరాబాద్, ఆగస్టు 8,పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు, ఆ తదుపరి మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ కాంగ్రెస్ హైకమాండ్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కూడా ఒక కీలకమైన పాఠాన్ని నేర్పుతోంది. ముఖ్యమంత్రిగా డి.కె. శివకుమార్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం చేపట్టిన కేబినెట్ విస్తరణలో కొత్తవారికి, యంగ్ లీడర్లకు అవకాశం కల్పిస్తూ 19 మందిని మంత్రివర్గంలోకి తీసుకున్నప్పటికీ, బెర్తులు దక్కని సీనియర్ ఎమ్మెల్యేలు రాజీనామా బాట పట్టడం కర్ణాటక కాంగ్రెస్‌లో తీవ్ర అలజడి సృష్టించింది. సీనియర్లు, మాజీ మంత్రులు బహిరంగంగా అసంతృప్తి వెళ్లగక్కడమే కాక, ఎమ్మెల్యే పదవులకూ వీడ్కోలు పలికే వరకు పరిస్థితి దాటిపోవడంతో.. వారిని చల్లార్చేందుకు నామినేటెడ్ పోస్టులు, కార్పొరేషన్ ఛైర్మన్ గిరీలతో సర్దుబాటు చేసేందుకు అధిష్ఠానం తీవ్ర కసరత్తు చేయాల్సి

వస్తుంది. కర్ణాటక పరిణామాలను అత్యంత సమీపంగా పరిశీలించిన తర్వాత, తెలంగాణలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ , రేవంత్ రెడ్డి ఉవని జి ఆశయాలకు అనుగుణంగా చేయాలనుకుంటున్న మార్పులపై అధిష్ఠానం ఆలోచనా విధానం పూర్తిగా మారింది. తెలంగాణలో ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీతో పాటు, కొందరు మంత్రుల శాఖల మార్పు లేదా కుదింపుపై ప్రచారం జరుగుతున్న తరుణంలో.. కర్ణాటక తరహా అసమ్మతి సెగలు హైదరాబాద్‌లో రగులుకోకుండా ఉండేందుకు ముందుజాగ్రత్త చర్యలు అవసరమని రేవంత్ రెడ్డి గ్రహించారని అనుకోవచ్చు. తెలంగాణ కాంగ్రెస్‌లోనూ సీనియర్లు, సీనియర్ రీజినల్ లీడర్లు కేబినెట్ బెర్తుల కోసం తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. రెడ్డి, బిసి, ఎస్సీ, ఎస్టీ , మైనారిటీ సామాజిక వర్గాల నుంచి అనేకమంది ఆశావహులు ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. రేవంత్ రెడ్డి తన నిర్ణయాల్లో యువ ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వాలని భావిస్తున్నప్పటికీ, దశాబ్దాలుగా పార్టీని నమ్ముకున్న సీనియర్లను పూర్తిగా పక్కనబెడితే కర్ణాటకలో మాదిరిగానే ఎమ్మెల్యేల తిరుగుబాటు లేదా సహాయ నిరాకరణ పెరిగే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వినిపిస్?తంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి అండ్ టీమ్ సామాజిక సమతుల్యత + కాంపెన్సేషన్ ప్యాకేజీ వ్యూహాన్ని తెరపైకి తెస్తున్నారు. కేవలం కేబినెట్ బెర్తులు ఇవ్వడమే కాకుండా, పదవులు రాని ముఖ్య నేతలకు ముందే స్పష్టత ఇచ్చి, వారికి పవర్ ఫుల్ నామినేటెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు, జిల్లా ఇన్‌ఛార్జ్ బాధ్యతలు, లేదా ప్రభుత్వ సలహాదారు పాత్రలను ఆఫర్ చేయడం ద్వారా ముందస్తుగానే అసంతృప్తికి చెక్ పెట్టాలని భావిస్తున్నారు. సర్దుబాటు ప్రక్రియ కేబినెట్ విస్తరణకు ముందే పూర్తయితే, ప్రమాణ స్వీకారం రోజున డ్రామాలు జరగకుండా నివారించవచ్చనేది కాంగ్రెస్ ప్లాన్. అంతేకాకుండా, సామాజిక సమీకరణల పరంగా ఉమ్మడి జిల్లాల ప్రాతినిధ్యాన్ని దెబ్బతీయకుండా జాగ్రత్త పడుతున్నారు. ఉదాహరణకు ఉమ్మడి నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి జిల్లాల మధ్య కాంబినేషన్ దెబ్బతింటే అది ప్రభుత్వ స్థిరత్వంపై ప్రభావం చూపుతుంది.కర్ణాటకలో డి.కె. శివకుమార్ ఓపిక పడితే అవకాశాలు వస్తాయి అని సర్దిచెప్పాల్సి వచ్చిన పరిస్థితిని తెలంగాణలో రాకుండా చూడాలంటే.. విస్తరణ రోజునే ఎవరికి ఏ పదవి లభిస్తుందో స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించడం ఒక్కటే సరైన మార్గమని ఏఐసీసీ భావిస్తోంది. కర్ణాటక కేబినెట్ విస్తరణ గందరగోళం తెలంగాణ కాంగ్రెస్ పాలనకు ఒక ముందస్తు హెచ్చరిక లా పనిచేసింది. కేవలం కొత్తవారికి అవకాశాలు ఇవ్వడం మాత్రమే కాకుండా, పార్టీ పాతకాపులను గౌరవిస్తూ, రాజీనామాల వేడి తగ్గించే సమగ్ర ప్యాకేజీతోనే రేవంత్ రెడ్డి తన కేబినెట్ విస్తరణను పూర్తి చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

## సొంత నానమ్మ డెట్ సిర్టిఫికేట్

## సృష్టించిన కాంగ్రెస్ నేత

చందానగర్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అరాచకాలు బయటపడ్డాయి. కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీహరి గౌడ్ సొంత నానమ్మ ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, భూమిని కబ్జా చేసాడని బంధువులు ఆరోపించారు. దుర్గం శ్రీహరి గౌడ్, 2023 లో ఫేక్ సర్టిఫికెట్ సృష్టించాడు. దానని నిలదీసిన బాబాయ్ భార్య, కొడుకుపై విచక్షణారహితంగా దాడి చేసాడు. తన భర్త పేరిట ఉన్న ఇంటి స్థలాని తన పేరు మీదకు బదిలీ చేయాలని జీహెచ్ఎంసి కార్యాలయానికి మహిళ వెళ్లింది. ఈ సమయంలో శేరిలింగంపల్లి కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీహరి గౌడ్ తన భర్త పేరిట ఫేక్ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, భూమిని తన పేరుమీదకు బదిలీ చేయించుకున్నాడని భార్య గుర్తించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరిపించారు. న్యాయం కోసం శ్రీహరి గౌడ్ ఇంటి ముందు అతని బాబాయ్ భార్య, ఆమె కొడుకు నిరసనకు దిగారు. దీంతో కోపంలో బాబాయ్ భార్య, కొడుకు అని కూడా చూడకుండా వారిపై విచక్షణారహితంగా శ్రీహరి గౌడ్, అతని సోదరుడు సతీష్ గౌడ్ దాడి చేసారు. దాడి చేశారని ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ ఆదేశాల మేరకు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేయడం లేదని బాధితులు ఆరోపిస్తునన్నారు.

ఫిర్యాదు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిసి బాధితులను చంపేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు.

## దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హోంమంత్రి

## అనిత కుమార్తె రేష్మిత జన్మదిన వేడుకలు

విశాఖపట్నం ఉషోదయ జంక్షన్లోని హిడెన్ స్ప్రౌట్స్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో హోంమంత్రి అనిత కుమార్తె రేష్మిత జన్మదిన వేడుకలు జరిపారు. దివ్యాంగ చిన్నారులతో ఆప్యాయంగా మమేకమై కార్యక్రమం జరిపారు. ప్రత్యేక పాఠశాల చిన్నారుల మధ్య రేష్మిత కేక్ కట్ చేసారు. చిన్నారులకు స్వయంగా పోషకాహారం, తాజా పండ్లు పంపిణీ చేసారు.చిన్నారులతో ఆప్యాయంగా గడిపారు. ఇటీవలే విజయవాడ మేరీ బ్లైండ్ పాఠశాలలో జన్మదిన వేడుకలు హోంమంత్రి కుమారుడు నిఖిల్ జరుపుకున్నాడు. ఆర్భాటాలకు దూరంగా సేవా కార్యక్రమాలతో జన్మదిన వేడుకలు హోంమంత్రి పిల్లలు నిర్వహించారు.

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియపై కార్యకర్తలు

## దృష్టి సారించాలి

హైదరాబాద్: తెలంగాణలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ాఎఖీ) రెండవ విడత ప్రక్రియపై బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్. రాంచందర్ రావు పిలుపునిచ్చారు.

శనివారం హైదరాబాద్లోని ఖైరతాబాద్ 'విశ్వేశ్వరయ్య భవన్'లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు ాఎఖీ రాష్ట్ర కన్వీనర్ వేముల అశోక్ అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ాఎఖీ) ఫేజ్-2 రాష్ట్రస్థాయి వర్క్షాప్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ... ాఎఖీ ప్రక్రియ ముగియడానికి కేవలం మరొక రెండు రోజులు మాత్రమే (ఆగస్టు 10 వరకు) సమయం ఉన్నందున, ప్రతి నియోజకవర్గంలోనూ అర్హులైన ప్రతి ఒక్కరిచేత ఫారమ్-6 ద్వారా కొత్త ఓటు నమోదు (ఇనితీనీశ్రీశ్రీఎవనిబి) వేగవంతంగా పూర్తి చేయించాలని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ గడువు ముగిసిన తర్వాత కూడా రాబోయే రోజుల్లో డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల పరిశీలన, నకిలీ ఓట్ల గుర్తింపు, ఆభ్యంతరాల (ాఎతీవఇఃబితీనీనిబ) దాఖలు వంటి కీలకమైన అంశాలు ఉంటాయని రాంచందర్ రావు స్పష్టం చేశారు.

ఫారమ్-7 (ఓట్ల తొలగింపు), ఫారమ్-8 (సవరణలు) సరైన రీతిలో దాఖలు చేయడం, నోటీసులకు తగిన ఆధారాలతో లీగల్గా సమాధానాలు ఇవ్వడం, పోలింగ్ బూత్ల రేషనలైజేషన్ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించడంపై బిఎల్ఏ-1లు (ఃఒం-1) మరియు లీగల్ టీమ్స్ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో ఓటర్ల జాబితా పారదర్శకత అత్యంత కీలకమని, ఆ బాధ్యతను బిజెపి ప్రతినిధులు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు.

## తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్

## విస్తృత తనిఖీలు

వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఆదేశాల మేరకు తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య ఆధ్వర్యంలో తాండూర్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాణిక్ నగర్ మరియు మున్సిపల్ క్వార్టర్స్ ప్రాంతాల్లో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ (అయూ) నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో తాండూర్ డీఎస్పీతో పాటు తాండూర్ టౌన్ ఇన్స్పెక్టర్ పరమేశ్వర్, కరణ్ కోట్ ఎఎ ప్రవీణ్ కుమార్ రెడ్డి, డివిజన్ పోలీసు సిబ్బంది, ఏఆర్ పార్టీ సిబ్బంది పాల్గొని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఇద్దరు అనుమానిత వ్యక్తులను తనిఖీ చేయడంతో పాటు, పాపిలాన్ పరికరాన్ని ఉపయోగించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 65 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలు మరియు 56 మద్యం బాటిళ్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాలు మరియు ఇతర రికార్డులను పరిశీలించిన అనంతరం, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నారు.ఈ కార్యక్రమం లో తాండూర్ డీఎస్పీ మాట్లాడుతూ తాండూర్ పట్టణంలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించాం. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు మరియు అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించాం. తనిఖీల్లో గుర్తించిన వాహనాల పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.నేరాల నియంత్రణ, అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజలకు సురక్షిత వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై సమాచారం అందించాలని కోరుతున్నాం. అని తెలిపినారు.

## ఆగస్టు 10 న జరిగే జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

## భానోత్ సీతారాం నాయక్ సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి



మహబూబాబాద్ పట్టణంలోని మల్లు స్వరాజ్యం నగర్ కాలనిలో జనరల్ బాడీ సమావేశాము కుంచపు మహేందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం పట్టణ కార్యదర్శి భానోత్ సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్స్ ను రద్దు చేయాల ని రైతు మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలని వ్యవసాయ కూలీలు పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని మార్పు బి బి జి రామ్ పథకాన్ని తీసుకురావడం జరిగింది దీనివలన గతంలో కేంద్ర ప్రభుత్వం 90% నిదురిస్తే రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతమే ఇచ్చేవారు కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% ఇవ్వాలని చెప్పడం జరుగుతుంది దీనివలన ఉపాధి హామీ పని రద్దు చేయాలనే యోజనలో కేంద్ర ప్రభుత్వం ఉన్నాడని అన్నారు కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగంలో కూడా ఉచితలను తీసేవేసే జీవోలు తీసుకురావడం జరిగిందని అన్నారు ప్రభుత్వం ఆ జీవోలను కూడా రద్దు చేయాలని అన్నారు బిజెపి తీసుకొచ్చిన కార్మిక కర్షక రైతు ప్రజా వ్యతిరేక చట్టాలని తక్షణమే రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికీ పెన్షన్స్.ఇందిరామ్మా ఇండ్లు.ఇంటి పట్టాలు.ఇండ్ల స్థలాలు. రైతులు రైతుల సాగులో ఉన్న వ్యవసాయ భూమికి పట్టాలు ఇవ్వాలనే డిమాండ్ తో మహబూబాబాద్ లో వివేకానంద సెంటర్ నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు వెలది మందితో జరిగే భారీ జైలు భరో కార్యక్రమంలో కార్మికులు కర్షకులు రైతు కూలీలు విద్యార్థులు ప్రజలు కాలనీవాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో సి పి యం పార్టీ పట్టణ కార్యదర్శులకు సభ్యులు కుమ్మరి కుంట్ల నాగన్న శాఖ కార్యదర్శులు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# యూఏఈ బతుకమ్మ సంబరాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

**అక్టోబర్ 11న దుబాయ్ అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్‌లో వేడుకలు**
**ముఖ్య అతిథిగా హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**
**గల్ఫ్ కార్మికుల సమస్యలపై ఈటీసీఏ ప్రతినిధులతో కేటీఆర్ చర్చ**

హైదరాబాద్: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ?యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు. గల్ఫ్ కార్మికుల పరిస్థితులపై ఆరాఈ సందర్భంగా ఈటీసీఏ ప్రతినిధులతో సమావేశమైన కేటీఆర్ గల్ఫ్‌లోని తెలంగాణ కార్మికుల పరిస్థితులు, ఉపాధి అవకాశాలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై ఆరా తీశారు. తెలంగాణ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లిన కార్మికుల ప్రస్తుత పరిస్థితులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. తెలంగాణకు దూరంగా గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్నప్పటికీ తమ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈటీసీఏ ప్రతినిధులను కేటీఆర్ అభినందించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పడంలో ప్రవాస తెలంగాణ సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈటీసీఏ కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం కాకుండా గల్ఫ్ కార్మికుల కష్టనష్టాల్లోనూ అండగా నిలుస్తూ, ఇబ్బందుల్లో ఉన్న తెలంగాణ బిడ్డలకు సహాయ సహకారాలు అందిస్తున్న తీరు గొప్పదని కేటీఆర్ అన్నారు. గల్ఫ్‌లో తెలంగాణ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తమ వంతు సహకారం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

# డీఎస్సీపై వైసీపీ తప్పుడు ప్రచారం.. యువతను తప్పుదోవ పట్టించొద్దు

## ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు
## పేర్ని నాని, అవినాష్, వెల్లంపల్లి, మల్లాది విష్ణు వ్యాఖ్యలకు బొండా ఉమా కౌంటర్‌ధి

సింగ్‌నగర్‌లోని విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ బొండా ఉమామహేశ్వరరావు గారి ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ అంశంపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమ గారు మాట్లాడుతూ:- డీఎస్సీ పేరుతో వైసీపీ నాయకులు అరాచకానికి పాల్పడుతూ, నిరుద్యోగ యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు, మెగా డీఎస్సీపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీ నారా లోకేష్ గారు బహిరంగ చర్చకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, వైసీపీ నాయకులు చర్చకు ముందుకు రావడం లేదన్నారు. డీఎస్సీకి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికే అధికారికంగా, లిఖితపూర్వకంగా పూర్తి స్పష్టత ఇచ్చిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానంలో భాగమైన బ్రిడ్జి కోర్సును కూడా వైసీపీ నాయకులు పేకాటతో పోల్చడం వారి అవగాహనలేమికి నిదర్శనమని అన్నారు. ఇప్పటికే ఉద్యోగాల్లో చేరి నెలల తరబడి విధులు నిర్వహిస్తున్న వారిని ఇప్పుడు రాజకీయ ప్రయోజనాల కోసం ఇబ్బందులకు గురిచేయాలని చూడటం సరికాదన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మెగా డీఎస్సీ జరగకుండా అనేక న్యాయపరమైన వివాదాలు సృష్టించారని, యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేశారని బొండా ఉమా ఆరోపించారు. ప్రస్తుతం కూడా మెగా డీఎస్సీపై రాజకీయ లబ్ధి కోసం గందరగోళం సృష్టిస్తూ, నిరుద్యోగ యువతను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ముత్యాలంపాడులో జరిగిన ఘటనలను ప్రస్తావిస్తూ, ప్రశాంతంగా ఉన్న విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో గొడవలు సృష్టించే ప్రయత్నాలను సహించేది లేదని హెచ్చరించారు, దాడులు చేయడం తెలుగుదేశం పార్టీ సంస్కృతి కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజా సమస్యలపై పోరాడటమే తమ విధానమని స్పష్టం చేశారు. కులాల పేరుతో రాజకీయాలు చేయడం మానుకోవాలని వైసీపీ నాయకులకు సూచించారు, ఏ కులాన్నీ రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాల్లోకి లాగడం సరికాదన్నారు, వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా రాజకీయాలను రాజకీయంగానే ఎదుర్కోవాలని హితవు పలికారు. వైసీపీ నేతలు పేర్ని నాని, అవినాష్, వెల్లంపల్లి శ్రీనివాస్, మల్లాది విష్ణు తదితరుల వ్యాఖ్యలపై స్పందించిన బొండా ఉమా.. వ్యక్తిగత విమర్శలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. వైసీపీ శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తే తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే ప్రజలకు ఇబ్బంది కలిగించేలా లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే తగిన విధంగా స్పందిస్తామని అన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారితో నిరంతరం చర్చిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నానని తెలిపారు. గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని, అభివృద్ధిలో సెంట్రల్ నియోజకవర్గం ముందంజలో ఉందని పేర్కొన్నారు. యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయకుండా, వాస్తవాలను ప్రజలకు వివరించాలి. తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను వైసీపీ నాయకులు మానుకోవాలి అని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు గారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో:- సెంట్రల్ నియోజకవర్గం కోఆర్డినేటర్ నవనీతం సాంబశివరావు, సెంట్రల్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు పైడి తులసి, బెజ్జం జైపాల్, పైడి శ్రీను, ఎలవర్తి శ్రీకాంత్, ఇప్పిలి మోహన్, మోతూ్కరి కాసిం, బొలిశెట్టి శేషుబాబు తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్ గ్రామ ప్రజలు అందరూ అమ్మవారి జాతర పండుగలో పాల్గొనాలి మాజీ సర్పంచ్ ఇందిరా అశోక్





మాజీ సర్పంచ్ దేవర దేశి ఇందిరా అశోక్ తెలిపారు

**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 8 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో అమ్మవారి జాతర పండగలో చిందేసి ఆడుతున్న మాజీ గ్రామ సర్పంచ్ ఇందిరా అశోక్ అమ్మవారి పండుగలో వైద్యాలు వాయిస్తుంటే ఉల్లాసం జోష్ సంతోషం ఇలాంటి కార్యక్రమాలు పెద్దలందరి సమక్షంలో అమలు అక్కలు మహిళా సోదరీమణులు చిన్నలు పెద్దలు బాలబాలికలు యవనస్తులు గ్రామ ప్రజలందరికీ మధ్యలో బోనాల పండుగ సంబరాలోపాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు అమ్మవారి ఆశీస్సులు మా గ్రామం పైన గ్రామ పెద్దల పైన గ్రామ నాయకుల పైన గ్రామ యువకుల పైన గ్రామ అక్కచెల్లెళ్ల పైన అందరి పైన అమ్మవారి ఆశీస్సులు నిండుగా దయచేయాలని ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గ్రామాన్ని ఆశీర్వదించాలని

# పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించామని భావిస్తే... సిబిఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారు

## అని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు

నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్ లో దీక్షా శిబిరంలో “3 వ రోజు” వీరులపాడు మండలం -నందిగామ పట్టణ- మండలాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహారదీక్షలను మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు ప్రారంభించారు.

మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబు, లోకేష్ లకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం లేక... విద్యాశాఖ డైరెక్టర్ తో ఏవేవో మాట్లాడిస్తున్నారు... అసలు క్రీడా కోటాలో ఏ ప్రాతిపదికన ఉద్యోగాలకు ఎంపిక చేశారో... ఇప్పటికీ సరైన సమాధానం చెప్పలేదు సర్టిఫికెట్ల పరిశీలనకు 1:1 నిష్పత్తిలో పిలిచామని చెబుతున్నారు.. హారిజాంటల్ రిజర్వేషన్ అంటారు ??.. 1:1 నిష్పత్తిలో పిలిచాక ఉద్యోగం ఇచ్చినట్లు కాదని అంటారు !!... అభ్యంతరాలు లేనప్పుడు ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.

విద్యాశాఖ డైరెక్టర్ గారు ఇంతకుముందు గుంటూరు కలెక్టర్ గా ఉన్నప్పుడు తురకపాలెంలో కలుషిత నీరు తాగి... దాదాపు పదుల సంఖ్యలో మరణాలు సంభవించిన కనీసం మరణాలను కట్టడి చేయకుండా... చర్యలు తీసుకోకుండా... అక్కడ చెడు పేరు సంపాదించుకున్నారు. ఆమె ఇప్పుడు మళ్లీ విద్యాశాఖ డైరెక్టర్ గా వచ్చి... ఇక్కడ సరైన పనితీరు కనబరచకుండా.. ప్రభుత్వానికి వంత పాడుతూ... డీఎస్సీ లో స్కాం దొరకలేదని కబుర్లు చెబుతున్నారు... ఏ స్కాం జరక్కపోతే జీవోలు మార్చాల్సిన అవసరం ఏమి వచ్చింది ??... స్పోర్ట్స్ కోటాలో ఎగ్జామ్ లేకుండా టీచర్ గా ఎలా ఎంపిక చేస్తారు ??.. ఆ తర్వాత ఎగ్జామ్ ఉందని జీవో ఎలా మారుస్తారని అన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డీఎస్సీలో చేసిన అవకతవకలకు బాధ్యత వహించాల్సిందే. రాజీనామా చేయాల్సిందే లేకపోతే ఈ ఉద్యమం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు.

# అసత్యాలు పదేపదే వల్లెవేస్తున్న వైసీపీకి రాజకీయ సమాధి తప్పదు

## మెగా డీఎస్సీ పై వైసిపి దొంగ దీక్షలు
## బద్వేలు తెలుగు దేశం పార్టీ ఇంచార్జ్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



బద్వేలు అసత్యాల పునాదులపై ప్రారంభమైన వైసీపీ తన ప్రస్థానంలో కీలకమైన అంశాల్లో ఏనాడూ నిజం చెప్పిన పాపాన పోలేదని బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇంచార్జి మంజూరు సూర్యనారాయణ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో అత్యంత పకడ్బందీగా డీఎస్సీ పోటీ పరీక్ష నిర్వహిస్తే పదేపదే సత్యదూరమైన ఆరోపణలు చేయడం ఆ పార్టీ నీచ సంస్కృతికి నిదర్శనమని దుయ్యబట్టారు. బద్వేలు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో డీఎస్సీపై వైసీపీ వైఖరిని ఆయన తీవ్రంగా ఎండగట్టారు. అక్రమాలు జరిగాయని నిరూపించదగ్గ స్పష్టమైన ఆధారాలు ఉంటే బహిరంగ చర్చకు రావాలని నారా లోకేష్ చేసిన సవాలును జగన్ ఎందుకు స్వీకరించలేదని నిలదీశారు. వైసిపి వైఖరిని హైకోర్టు తప్పు పట్టిన పదేపదే డీఎస్సీ పై ఆరోపణలు చేయడం దీక్షలు సిగ్గుచేటని బహుశా నిజం చెబితే జగన్ తల వేయి ముక్కలు అవుతుందేమో..! అన్న శాపం ఏమైనా ఉందేమోనని ఎద్దేవా చేశారు. జగన్‌ది ఒక బూర్జువా మనస్తత్వమని సూర్యనారాయణ రెడ్డి ఆరోపించారు. ఆయనకు పేదల పట్ల వ్యతిరేకత, చిన్నచూపు, ఏహ్యాభావం ఉన్నాయన్నారు. సర్కారు పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగై పేదలు చదువుకుని తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి ఎదగడం ఆయనకు ఇష్టం ఉండదన్నారు. అందుకే అడుగడుగునా జగన్ అతని పార్టీ నాయకులు డీఎస్సీ నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే అత్యంత పకడ్బందీగా డీఎస్సీ నిర్వహించి 16,347 మందిని ఉపాధ్యాయ పోస్టుల్లో నియమించిన ఘనత లోకేష్ బాబుకు దక్కుతుందన్నారు. అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా పరీక్షల నిర్వహణ, నియామకాలు జరిగాయని పేర్కొన్నారు. వాస్తవానికి జాతీయస్థాయిలో జరిగే జేఈఈ లాంటి పరీక్షల నిర్వహణలో అనుసరించిన అత్యుత్తమ ప్రమాణాలు డీఎస్సీలో కూడా పాటించడం జరిగిందన్నారు. డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ దుర్మార్గ ధోరణికి నిదర్శనమన్నారు. వైసీపీ చేస్తున్న ఆరోపణలు ఉపాధ్యాయ వృత్తిలో కొలువుదీరిన అత్యంత ప్రతిభావంతులను అవమానించడమే అవుతుందన్నారు. వారి మేధస్సును పరిహసించడం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో జగన్ ఏనాడూ ఒక ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయకుండా పేదల విద్యను అపహాస్యం చేశారని ఆరోపించారు. 23 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రగల్భాలు పలికిన ఆయన, 2024 ఎన్నికల ముందు ఉత్తుత్తి నోటిఫికేషన్ ఇచ్చి మిన్నకుండిపోయారని విమర్శించారు. నిరుపేదలు ఎక్కువగా చదువుకుంటున్న ప్రభుత్వ బడుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, మౌలిక వసతులు కల్పించాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయడం జరిగిందన్నారు. అలాగే పాఠశాలల్లో అవసరమైన మౌలిక సౌకర్యాలను కూడా మెరుగుపరుస్తున్నామన్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందించగలిగితే సామాన్యుడు కూడా అత్యున్నత స్థాయికి ఎదగగలడన్నారు. పేదరికం నుంచి వచ్చిన వారికి సమాజం పట్ల గౌరవం, విశ్వాసం ఎక్కువన్నారు. అలాంటి వారి వల్ల సమాజానికి చాలా మేలు జరుగుతుందని చెప్పడానికి అట్టడుగు స్థాయి నుంచి భారత రాజ్యాంగ నిర్మాతగా ఎదిగిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గొప్ప ఉదాహరణ అన్నారు. అదే లక్ష్యంతో నారా లోకేష్ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తున్నారన్నారు. ఆయన తీసుకుంటున్న చర్యల వల్ల నేడు సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా పెరుగుతోందన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు కూడా ప్రభుత్వ స్కూళ్లలో చేరుతున్నారని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య లభిస్తుందన్న భరోసా ఇవ్వడం వల్లే ప్రైవేటు పాఠశాలలకు సమానంగా సర్కారు బడులు ఎదుగుతున్నాయన్నారు. ఒక ఆదర్శమైన విద్యా వ్యవస్థను రాష్ట్రంలో తీర్చిదిద్దడానికి లోకేష్ నిత్యం ఎంతో శ్రమిస్తున్నారన్నారు. మెరుగుపడుతున్న విద్యా వ్యవస్థ గురించి తక్కువ చేసి, నీచంగా మాట్లాడడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇలాంటి ఆరోపణలతో ఆ పార్టీకి రాజకీయ సమాధి తప్పదని సూర్యనారాయణ రెడ్డి హెచ్చరించారు. పత్రికా విలేకరుల సమావేశంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు

# శాతవాహన అన్ని పిజి రెండవ సెమిస్టర్ పరీక్షల తేదీల విడుదల

కరీంనగర్ శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని పిజి రెండవ సెమిస్టర్ (రెగ్యులర్, బ్యాక్ లాగ్)ఎం ఏ, ఎం కాం, ఎం ఎస్సి, ఎం బి ఏ, ఎం సి ఎ, థియరీ పరీక్షల టైమ్ టేబుల్‌ను పరీక్షల నియంత్రణ విభాగం విడుదల చేసింది. పరీక్షలు 12-08-2026 నుండి ప్రారంభమై 27-08-2026 తో ముగియనున్నాయి. పరీక్షలు మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు జరుగుతాయి. మరిన్ని వివరాలకు విద్యార్థులు ఆయా కళాశాలలో గాని లేదా విశ్వవిద్యాలయ వెబ్సైట్ ని సందర్శించాలని పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ డి సురేష్ కుమార్ తెలిపారు.

# హనుమాన్ ఆలయ స్థలం లో అక్రమ షెడ్డు నిర్మాణానికి ప్రయత్నం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 08 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా :** పుల్కల్ మండల పరిధిలోని మంతూర్, గ్రామంలో గల శ్రీ ఆంజనేయస్వామి, ఆలయానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలం కబ్జాకు గురైందని, గ్రామం లోని వివిధ కులాల ప్రజలు ఆరోపింస్తున్నారు,అందులో రేకుల షెడ్డు నిర్మించాలని కొంతమంది మాట్లాడుకొని రాజకీయం చేస్తూ, షెడ్డు నిర్మాణం చేస్తున్నారు. గ్రామ ప్రజలు ఎవరు ఏమి చెప్పిన వినకుండా కూడా షెడ్డు నిర్మాణంచేస్తున్నారు, మంత్రి దామోదర రాజనర్సింహ , చెప్పిన కూడా గ్రామం లోని నాయకులు అయన మాటలు పెడిచేవినా పెట్టడం సరికాదు అన్నారు.ఈ సందర్భంగా ఆయా కులాల ప్రజలు మాట్లాడుతూ,మంతూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఈ ఖాళీ స్థలాన్ని హనుమాన్ దేవాలయానికి వచ్చే భక్తుల కోసం, ఆలయం వద్ద వివిధ కార్యక్రమాలు చేసుకునేందుకు





వంటలు వండుకునేందుకు, ఇబ్బందులు పడొద్దు అని హనుమాన్ ఆలయం కు ఖాళీ స్థలం విడిచిపెట్టడం జరిగిందని వారు పేర్కొన్నారు. గత కొన్ని ఏళ్లుగా లేని ఇబ్బంది ఇప్పుడు కొంతమందికి ఎందుకు వచ్చింది. దీన్ని రాజకీయాలు చేస్తున్నారు. కానీ ఆలయాల్లో రాజకీయాలు చేయొద్దని సూటిగా ప్రశ్నించారు. ఈ ఖాళీ స్థల విషయమై ఇటీవల.జిల్లాకలెక్టర్ కు.మరియు. (జడ్.పి.సి.ఈ.ఓ) కు .మరియు. పుల్కల్ మండల తహసిల్దార్ కు వినతి పత్రం అందజేసినట్టు వారు గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులుపూర్తిస్థాయిలో విచారణ చేసి, దేవాలయానికి సంబంధించిన స్థలాన్ని కాపాడాలనీ వారు కోరుతున్నారు....

# భీమన్న ఆలయంలో భక్తుల రద్దీ ప్రత్యేక పూజలతో సందడిగా ఆలయ ప్రాంగణం



**వేములవాడ, ఆగస్టు 8 (ప్రజాబలం ప్రతినిధి):**వరుసగా మూడు రోజుల సెలవులు రావడంతో వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామినీ భక్తులు దర్శించుకోవడానికి తరలివచ్చారు. జిల్లాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తుల సందడితో కిటకిటలాడాయి.భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు. కోడె మొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు, సత్యనారాయణ వ్రతం, నిత్యకల్యాణం, చండీహోమం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రసాదాల పంపిణీ, కోడె మొక్కుల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించారు.

వరుస సెలవులతో భారీగా భక్తులు తరలిరావడంతో భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. భక్తులు ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

# పంచలింగాల్ వీధిలైట్లతో అందంగా ముస్తాబ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 8 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పంచలింగాల్ గ్రామంలో గల్లి గల్లి లో వీధిలైట్లతో అందంగా ముస్తాబైనట్టు తెలిపారు పరిసరాల పరిశుభ్రత తడి చెత్త పొడి చెత్త పరిసరాలు పరిశుభ్రత ఇలా అన్ని కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు వార్డు వారిగా ప్రతి వార్డులో వీధిలైట్లు అమర్చడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ బి మహేందర్,9 వార్డు మెంబర్ సామెల్,7వార్డు మెంబర్ విజయ్ కుమార్, తెలిపారు

# కేరళ పాఠశాలలో ఘనంగా బోనాల పండుగ

## సాంప్రదాయ వేషధారణలతో కనువిందు చేసిన విద్యార్థులు



**హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 9** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ వేడుకలను జమ్మికుంట పట్టణంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే విద్యతో పాటు తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పాఠశాల యాజమాన్యం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.ఈ సందర్భంగా విద్యార్థులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలు సమర్పించారు. పలువురు విద్యార్థులు పోతురాజు, ఇతర సాంప్రదాయ వేషధారణల్లో అలరించారు. విద్యార్థుల నృత్యాలు, సాంప్రదాయ వేషధారణలతో పాఠశాల





ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ కే.ఎస్. బెన్ని అమ్మవారికి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. బోనాల పండుగకు తెలంగాణ ప్రజల జీవన విధానంలో విశిష్టమైన స్థానం ఉందని, కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలతో ఈ పండుగకు ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయురాళ్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పట్లూర్ గ్రామంలో బోనాల పండగలో అందరు పాల్గొనాలి గ్రామ సర్పంచ్ పరు శురాం






**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 8 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ గ్రామంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించడం జరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు కార్యక్రమంలో పాల్గొనాలని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు రెండు రోజుల నుండి అమ్మవారి పూజ కార్యక్రమాలు గ్రామ పెద్దల సహాయ సహకారాలతో ప్రేమానురాగాలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్దల సమక్షంలో ఘనంగా పండగ సంబరాలుప ట్లూరు గ్రామంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగ అమ్మవారి బోనాల పండుగ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు అమ్మవారి పండగ సంబరాల్లో ఆట పాటలతో ఎంతో ఘనంగా పండగ సంబరాలు జరుపుతున్నట్టు తెలిపారు అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని గ్రామ సర్పంచ్ పరుశురాం తెలిపారు

## ప్రపంచ ఆదివాసి గిరిజన సభను జయప్రదం చేయాలి ఎల్ హెచ్ పి ఎస్ అధ్యక్షులు దశరథ్ నాయక్.



**ఖమ్మం జిల్లా ప్రతినిధి ఆగస్టు 8 ప్రజాబలం:**కొత్తగూడెంలో ఆదివారం జరిగే ప్రపంచ ఆదివాసి దినోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రతి ఒక్కరు సభకు తరలిరావాలని లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు దశరత్ నాయక్ పిలుపునిచ్చారు. అనంతరం నాయక్ మాట్లాడుతూ ఆదివాసుల గురించి పలు డిమాండ్లు చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఒకే ఎస్టీ జాబితాలో కేంద్ర ప్రభుత్వం చేర్చాలని తండాలను గ్రామపంచాయతీలను రెవెన్యూ గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయాలని రాజ్యాంగంలోని ఐదవ షెడ్యూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంతంలో 100% శాతం రిజర్వేషన్లకు రాష్ట్రంలో అమలు చేయాలని, గోర్ బోలింగ్ కేంద్ర ప్రభుత్వం అధికారికంగా గుర్తించి రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చాలని పలు డిమాండ్లతో సభను నిర్వహిస్తున్నామని తెలిపారు

# గృహకల్పలో ఆషాడా మాసం బోనాలు



**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** తెలంగాణ ఆషాడా మాసం బోనాల సందర్భంగా తెలంగాణ సహకార శాఖ, కేంద్ర కార్యాలం, గృహకల్ప ప్రాంగణంలో అమ్మ వారికీ అంగ రంగా వైభవంగా బోనాలు సమర్పించడం జరిగింది,ఈ కార్యక్రమానికి కమీషనర్ రాహుల్ రాజ్ ఐ. ఏ. ఎస్ వారి సతీమణి నీరజ పాల్గొని అమ్మ వారికీ బోనం సమర్పించారు

కార్యక్రమం లో భాగంగా కమీషనర్ మాట్లాడుతూ శాఖ పనిచేస్తున్న ఉద్యగులు మరియు తెలంగాణ ప్రజలదరు సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మ వారిని కోరుకున్నానని అన్నారు.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర సహకార శాఖ గెజీటెడ్ అధికారుల సంఘము అధ్యక్షులు జగన్ మోహన్ మరియు ప్రధాన కార్యదర్శి భీమ్ రాజ్ మరియు అధికారులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమం టీ. ఎన్. జి. ఓస్ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీ రామ్ సహకార శాఖ (హెచ్. ఓ. డి )టీ.ఎన్. జి. ఓస్ సంఘము అధ్యక్షులు అంజలి హాజరైనారు. ఈ కార్యక్రమం

వినోద్, విశాల్, రాము, సాయి కిరణ్, భరత్ ల సహకారం తో విజవంతం జరిగింది.

# గీతన్నల చైతన్య బస్సు యాత్రను జయప్రదం చేయాలి



**జహీరాబాద్, ఆగస్టు 8 ప్రజాబలం ప్రతినిధి:** ఈ నెల 13న సంగారెడ్డి జిల్లాకు చేరుకోనున్న గీతన్నల చైతన్య రాష్ట్ర బస్సు యాత్రను జయప్రదం చేయాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం జహీరాబాద్‌లో యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. గీత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని, కల్లుగీత వృత్తి సంక్షేమానికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని గీత కార్మికులు, గౌడ సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో దిగ్వాల్ శ్రీనివాస్ గౌడ్, విట్టల్ గౌడ్, కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, మాణిక్ ప్రభు గౌడ్, రంగా గౌడ్, అంజా గౌడ్, శేఖర్ గౌడ్, లక్ష్మా గౌడ్, రవి గౌడ్, బాలరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అల్గోల్‌లో కాలుష్యంపై ఆందోళన



**జహీరాబాద్, ఆగస్టు 8 ప్రజాబలం ప్రతినిధి:** అల్గోల్, భారత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అల్లానా కర్మాగారం నుంచి వెలువడుతున్న దుర్వాసన, గాలి కాలుష్యంతో శ్వాస ఇబ్బందులు, దగ్గు, కళ్లలో మంట వంటి సమస్యలు ఎదురవుతున్నాయని ఆరోపిస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కాలుష్య నియంత్రణ అధికారులు సమగ్ర తనిఖీలు నిర్వహించి గాలి నాణ్యతను పరీక్షించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.

# జాబ్ క్యాలెండర్ రెడీ ...

నెల్లూరు, ఆగస్టు 8 రాష్ట్రంలో త్వరలోనే మెగా జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ ప్రకటించారు. ఇదే సమయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని, సున్నా స్థానాలకే పరిమితం కావాల్సి ఉంటుందని ఆయన జోస్యం చెప్పారు. శనివారం నెల్లూరులో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన సందర్భంగా మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.వైసీపీ ఒక గొడ్డలి పార్టీ అని, ఆ పార్టీ నేతలు సైకోల్లా ప్రవర్తిస్తున్నారని నారాయణ మండిపడ్డారు. ఉన్నత న్యాయస్థానాలు హెచ్చరించినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు రావడం లేదని విమర్శించారు. ప్రజల్లో గందరగోళం సృష్టించి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. 16,000 టీచర్ పోస్టులను భర్తీ చేస్తున్నందుకా లోకేశ్ రాజీనామా చేయాలని కోరుతున్నారని ఆయన ప్రశ్నించారు.ప్రపంచస్థాయి ప్రమాణాలతో నిర్మిస్తున్న భోగాపురం విమానాశ్రయం ప్రాజెక్టు నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే వైసీపీ ధర్నాలకు దిగుతోందని నారాయణ ఆరోపించారు. ఆ పార్టీ చేపడుతున్న నిరసన కార్యక్రమాలకు సొంత పార్టీ నేతల నుంచే వ్యతిరేకత వ్యక్తమవుతోందని, 'మావిగన్' అంటూ చేస్తున్న రాద్ధాంతాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన ఎద్దేవా చేశారు.

# అల్లుడు చేతిలో అత్త దారుణ హత్య!

## ఆస్తి వివాదమే కారణమా..?



**సత్తుపల్లి ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 8:** సత్తుపల్లి మండలం తుమ్మూరు గ్రామంలో ఆస్తి వివాదం ఓ మహిళ హత్యకు దారితీసినట్లు పోలీసుల విచారణలో వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన వెదుళ్ల వెంకట నరసమ్మ మూడు రోజుల క్రితం అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు సత్తుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ క్రమంలో నరసమ్మ అల్లుడు గుండాల తిరుపతిరావుపై అనుమానం వచ్చిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించినట్లు సమాచారం. పోలీసుల విచారణలో నరసమ్మను హత్య చేసినట్లు తిరుపతిరావు అంగీకరించినట్లు తెలుస్తోంది.

# ఘనంగా ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు



**జహీరాబాద్, ఆగస్టు 8 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో పార్లమెంట్ సభ్యుడు సురేష్‌కుమార్ షెట్కర్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కేక్ కట్ చేసి ఎంపీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎంపీ సురేష్‌కుమార్ షెట్కర్ ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహ్మద్ యూనుస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# టీ వై జె ఎఫ్ సంగారెడ్డి జిల్లా జాయింట్ సెక్రటరీగా జెల్లా భాగయ్య

## అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడిగా మాదిగ బుచ్చయ్య ఏకగ్రీవ ఎన్నిక

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 08 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** టి వై జె ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్, ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా కామగళ్ల నరేష్,



ఆధ్వర్యంలో నిన్న శుక్రవారం నిర్వహించిన సమావేశంలో, నూతన నియమాకాలు చేపట్టారు, ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా సెక్రెటరీ బి, రాజు, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభు, జిల్లా జాయింట్ సెక్రెటరీగా జెల్ల భాగయ్యను, అందోల్ నియోజకవర్గం అధ్యక్షుడిగా మాదిగ బుచ్చయ్యను, అందోల్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగానాగరాజును,ఏకగ్రీవంగాఎన్నుకున్నారు, ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నాయకులకు, జిల్లా అధ్యక్షుడు కామగల్ల నరేష్, శుభాకాంక్షలు తెలియజేస్తూ, జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు, సంఘ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు, నూతన బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూ, టీ వై జె ఎఫ్ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా భాగయ్య, మాదిగ బుచ్చయ్య, తెలిపారు, ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోష్ గుప్తా, సంగారెడ్డి టౌన్ వైస్ ప్రెసిడెంట్ మహేందర్,తదితరులు పాల్గొన్నారు

## వివేక హత్య కేసులో లోపాలు

కడప, ఆగస్టు 8 మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి 75వ జయంతి సందర్భంగా పులివెందుల్లోని ఆయన సమాధి వద్ద కుమార్తె వైఎస్ సునీత, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన సునీతా రెడ్డి... వివేకా హత్య కేసు విచారణ, ఇటీవలి తీర్పులు సరిగా లేవని ఆరోపిస్తూ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. విచారణ సరిగా జరగకపోవడం వల్లే తాము పదే పదే కోర్టు మెట్లు ఎక్కాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.వివేకా హత్య జరిగిందనే విషయం అందరికంటే ముందు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికే తెలుసని సునీత ఈ సందర్భంగా స్పష్టం చేశారు. విచారణలో ఎన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఏదో ఒక రోజు కచ్చితంగా న్యాయం జరుగుతుందనే గట్టి నమ్మకంతోనే తాను ఈ పోరాటాన్ని కొనసాగిస్తున్నానని తెలిపారు.

# అడవి బిడ్డలకు వందనం..

## నేడే ప్రపంచ ఆదివాసి దినోత్సవం

## తరాలు మారిన మారని సంస్కృతి

## ఇంకా అభివృద్ధికి దూరంగా ఆదివాసి గూడెలు







**చంద్రుగొండ జూలై 8 ప్రజాబలం ప్రతినిధి:**– చుట్టూ దట్టమైన అరణ్యం.. కొండ కోనల మధ్య ఆవాసం.. సంప్రదాయాలు, కట్టుబాట్లతో జీవనం.. విలక్షణమైన ఆహార్యం... అడవితల్లి ఒడిలో ఒరిగి పయనం ఇలా విలక్షణ జీవనశైలి ఆదివాసీలది. వాళ్లే దేశానికి మూలవాసులు తమ సంస్కృతిని కంటికి రెప్పలా కాపాడు కుంటూ భవిష్యత్ పై కోటి ఆశలు పెట్టుకుని మనుగడ సాగిస్తున్నారు. సామాజిక చైతన్యం వైపు అడుగులు వేస్తున్నారు. ఈ అడవిబిడ్డలకు కష్టం ఎంతైనా తరగని చిరునవ్వు, తరాలు మారినా మారని సంస్కృతి ఆదివాసీలకే సొంతం, అడవితల్లిని నమ్ముకుని జీవిస్తున్న ఆదివాసీ గిరిజనుల సంప్రదాయాలు నేటికీ అద్దం పడుతున్నాయి. ఆదర్శంగా నిలుస్తున్నాయి. ప్రస్తుత ఆధునీక సమాజంలోనూ వారి సంస్కృతిని పాడుకుంటూ తరువాత తరాలకు అందిస్తున్నారు. గుస్సాడి ఉత్సవాలతో గ్రామాల మధ్య ఒక్కతను దండోరా సంబరాలతో ఆకట్టుకుంటున్నారు గుస్సాడి వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. వారి ఆహార అలవాట్లు వారి ఆరోగ్యానికి శ్రీరామరక్షగా నిలుస్తున్నాయి. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా వారి అలవాట్లు, వేషభాషలపై ప్రజాబలం దినపత్రికలో ప్రత్యేక కథనం

ఆదివాసి వాయిద్యాలు డోల్ (డోలు)డోలు

డప్పులను ఆదివాసీలు దైవ కార్యక్రమంతో పాటు ఇతర శుభకా ర్యాల్లో వాయిస్తారు. గ్రామ పెద్ద లేదా సమాజం గుర్తింపు పొందిన ఆదివాసీ వ్యక్తి మరణిస్తే అతని దహన సంస్కారణాలలో వహిస్తారు.ఒక్కో కార్యానికి ఒక్కో తీరు ఉంటుంది. పెళ్లిలో పది రకాల డోలు వాయిస్తారు. అవసరాన్ని బట్టి డోల్, డోల్యాబ్, నో డ్ంగాల్ అనే ఇద్దరు వ్యక్తులు ఆయా రకాల్లో వాయిస్తారు.

డాప్ (డప్పు)

దండారీ, దేవి ఉత్సవాలలో డప్పులు వాడతారు. ఇది కూడా 10 రకాలుగా ఉంటుంది. బాజాల తీరు, కార్యాన్ని బట్టి వాయిస్తారు. ఆదివాసీల సంస్కృతిలో భాగంగా వారి ఆచారం ప్రకారం

వాయిస్తూ నృత్యం చేస్తారు.

పెప్రే (సన్నాయి)

ప్రధాన్, తోటీలు షెఫీలను వాయిస్తారు.డప్పులకు తోడు పెప్రీ అవసరం ఉంటుంది. సన్నాయి లేకపోతే ఏ ఉత్సవమైన ఘనంగా జరగదు. ఈ రెండు ఉంటేనే ఉత్సవానికి ఊపు వస్తుంది.

కాలికోంట కొమ్ము)

పైపీతో పాటు కాలికొం ఉంటుంది.వీ. టిని ప్రధాన్ లు వాడుతారు దీనిని ఉత్సవం ప్రారంభంలో లేదా ఏదైనా కార్య క్రమంలో అప్పుడప్పుడు ఊదుతూ ఉంటారు.

తుడుం

డోలు, డప్పులతో తుమతి ఉంటుంది. తుడుమును కేవలం, దైన పూజ కార్యక్రమంలో మాత్రమే ఉపయోగి స్తారు. దేవుళ్ళకు సంబంధించిన కార్యంతో పాటు అతిధుల స్వాగతనికి మాత్రమే వాడుతారు.

కిక్రీ

ఇది తోటి, ప్రధాన్ లతో ఉంటుంది. పెర్సా పెన్, పెద్దదేవుల పురాణ కథలను కికి సమేతంగా పాడి వినిపిస్తారు.

డోల్ కి

ఇది ఆదివాసీలు వివాహ సమయంలో గుడికి వెళ్ళేటప్పుడు ఉప యోగిస్తారు. పెళ్లి కార్యక్రమం పూర్తయిన తర్వాత రాత్రి దేంసా కార్యక్రమంలో దీని వాడతారు.

ఆకట్టుకునే సంస్కృతి సంప్రదాయాలు

అదివాసుల సంస్కృతి సంప్రదాయాలు ప్రతి ఒక్కరిని ఆ కొట్టుకునేట్టు నిర్వహిస్తారు

ఇప్ప పరక నూనెకు ప్రాధాన్యం

ఆదివాసీలు సంస్కృతి, సాంప్రదాయాలను నేటికీ కొనసాగిస్తు న్నారు. సహజ వనరులు అయిన భూమి, నీరు అడవిలో దొరికే ఫలాలపై ఆధారపడి ఎంతో ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నారు. చెట్టు, పుట్ట నీరు వంటి వాటికి పూజలు చేసి వాటితో అభినాభావ సంబంధం ఏర్పరచుకుంటారు. అదివా స్త్రీలు ఆషాడ మాసం లో నిర్వహించే తొలి పండగ ఆకాడి( వన) దేవతలకు పూజలు, సాగు పూజలు, శుభకార్యాలు తదితర పూజలకు ఇప్పవరక నూనెకు అధిక ప్రాధాన్యత ఇస్తారు. అడవిలో సేకరించిన ఇప్పపారకలతో తీసిన నూనెతో నైవేధ్యం,తయారు చేసి దేవతలకు సమర్పించడంతో పాటు దీపారాధనకు వినియోగిస్తారు. ఆదివాసి గ్రామాలలో టేకు మొద్దులతో తయా రుచేసిన గాన దర్శనమిస్తుంది.ఏటా దసరా తర్వాత ఆశ్వీజయ పౌర్ణమితో దందారి ఉత్సవాలు ప్రారంభమై దీపావళి అమావా ముగిస్తారు. ఈ సమయంలో గుస్సాడీ వేషదా రణ చేసి ఒక గ్రామం నుంచి వేరే గ్రామానికి వెళ్లారు. అలా వెళ్లి వాళ్ళ కులదైవాన్ని ఘనంగా వేడుకలతో గిరిజనులు పూజిస్తారు. వేడుకలకు ఆదివాసులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఆదివాసీ దేవత లకు బియ్యంతో పాయసం, పప్పుతో రుబ్బిన గారలను నైవేద్యంగా సమర్పిస్తారు. దండారి పేర్సా పెన్ ఉత్సవాల సమయంలో ఆర్యవైశ్యులు గోదారమ్మకు శాంతి పూజలు

మారని బతుకులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక సంఖ్యలో గిరిజన ఆదివాసులు ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోనే ఆదివాసిలో అభివృద్ధికి బాటలు వేసేందుకు ఏర్పాటైన ఐటీడీఏ నాలుగు దశాబ్దాలు దాటిన వారి జీవన విధానంలో ఎలాంటి మార్పులను తీసుకురాలేదు. నేటికీ చాలా ఆదివాసి గిరిజన ప్రాంతాలు కనీసం మౌలిక వసతులు, సౌకర్యాలు లేక అల్లాడుతున్నాయి. విద్యా, వైద్యం,సాగునీటి సౌకర్యం అందని దక్ష గానే మిగిలింది. యాట బ్రూరాలు, వ్యాధులతో వందల సంఖ్యలో మృత్యు ఒడి చేరుతున్నారు.

మా సాంప్రదాయం మారదు

మేమంతా ఒకే తాటిపై ఉంటాం. మా తల్లిదండ్రులు, తాతలు నేర్పిన సంప్రదాయాలను మేము వదులుకోము.మా భవిష్యత్ తరాలు అభివృద్ధిలోకి వచ్చి వాళ్ళ బంగారు భవిష్యత్తు బాగుం దాలంటే ఎస్టీ వర్గీకరణ జరగాలి. ఏదైతే రాజ్యాంగంలో పొందు పరిచిన అంశాలను యధావిధిగా కొనసాగించి ఆదివాసుల అభ్యదయానికి ప్రతి ఒక్కరు పాటుపడాలి.

బొర్రా సురేష్ ఆదివాసి నాయకులు

# వేంసూరులో మట్టి బకాసురులు..

# చోద్యం చూస్తున్న అధికారులు.

## గుట్టలు గుల్ల.. కాల్వలు, చెరువుల నుంచి మట్టి తరలింపు

## ఏపీ నుంచి అక్రమంగా ఇసుక రవాణా..

## పట్టుకున్న టాస్క్‌ఫోర్స్

**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 8:**వేంసూరు మండలంలో మట్టి, ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్స్కవేటర్లు, జేసీబీలతో గుట్టలను తవ్వి మట్టిని ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి తరలింపు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.వేంసూరులోని పెద్దగుట్టను భారీ యంత్రాలతో తవ్వి నాణ్యమైన మట్టిని తరలిస్తున్నారని, మట్టి కోసం ఇతర ప్రాంతాల నుంచి కూడా కాంట్రాక్టర్లు, వ్యాపారులు వస్తున్నారని గ్రామస్థులు చెబుతున్నారు.





మండలంలోని ఎన్నెస్పీ కాల్వలు, చెరువుల నుంచి కూడా మట్టి అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఏపీ నుంచి ఇసుక అక్రమ రవాణా?మట్టి దందాతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వేంసూరు మండలానికి ఇసుక అక్రమంగా రవాణా అవుతోందనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. మండలంలో నడుస్తున్న మిక్చర్ ప్లాంట్లకు ఏపీ నుంచి ఇసుక తరలించి, ఇసుక, కంకర, సిమెంట్ మిశ్రమాన్ని నిర్మాణ పనులకు వినియోగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అక్రమ మట్టి, ఇసుక రవాణాకు కొంతమంది రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇదిలా ఉండగా శుక్రవారం వేంసూరు మండలం కుంచపర్తి వద్ద ఆంధ్రప్రదేశ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్‌ను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. అనంతరం వాహనాన్ని వేంసూరు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై ఎస్ఐ కవిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అక్రమ ఇసుక వ్యాపారం చేసే వారి పై పీడి యాక్ట్ కేసులు నమోదు చేశారు. ఇప్పుడు ఈ ఆంధ్ర అక్రమార్కులపై అవే కేసులు నమోదు అవుతాయా ?ఒక టిప్పర్ పట్టుబడటంతోనే దందా ఆగిపోతుందా? మండలంలో జరుగుతున్న మట్టి, ఇసుక అక్రమ రవాణాపై సమగ్ర విచారణ జరిపి, అక్రమ తవ్వకాలు––రవాణాకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# పట్నం కుటుంబాన్ని పరామర్శించిన ఎల్బీనగర్ ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి



మాతృ వియోగానికి గురైన పట్నం కుటుంబాన్ని ఎల్బీనగర్ ఎంఎల్ఏ సుధీర్ రెడ్డి పరామర్శించారు. మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి మాతృ మూర్తి పట్నం రుక్కమ్మ మృతి చెందిన నేపథ్యంలో బంజారాహిల్స్ లోని ఆయన నివాసానికి వెళ్లి పట్నం రుక్కమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. మహేందర్ రెడ్డి తో పాటు మల్కాజిగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి,జిల్లా పరిషత్ మాజీ చైర్పర్సన్ పట్నం సునీత రెడ్డి కి తమ సానుభూతిని వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు గజ్జల మధుసూదన్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి తదితరులు ఆయనతో ఉన్నారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని వరుణ హోమం

## నీలాద్రి శ్రీ నీలాద్రిశ్వర స్వామి దేవస్థానంలో వైభవంగా పూజలు




**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 8:** ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం నీలాద్రిలోని శ్రీ నీలాద్రిశ్వర స్వామి దేవస్థానంలో సకాలంలో వర్షాలు కురవాలని, అతివృష్టి, అనావృష్టి లేకుండా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఉదయం 9 గంటల నుంచి గణపతి పూజ, పుణ్యవచనం, వరుణ హోమం, వరుణ జపం, ఋష్యశృంగ ఆవాహనం, సహస్ర ఘటాభిషేకం తదితర కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.దేవస్థానంలో నూతనంగా నియమితులైన అర్చకులు కేతముక్కల పవన్ కుమార్ శర్మ, ప్రతాప నాగ సాయి వంశీ మాధవ్ పర్యవేక్షణలో కొత్తగూడెం విజయ విఘ్నేశ్వర స్వామి దేవస్థాన అర్చకులు అనిపెద్ది ప్రసన్నకుమార్ శర్మ, వేదపారాయణులు సుబ్రహ్మణ్య శర్మ మంత్రోచ్చరణల మధ్య కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారుఈ కార్యక్రమంలో రెనోవేషన్ కమిటీ సభ్యులు చీకటి నరసింహారావు, మిట్టపల్లి నరేంద్ర, మానికల ప్రసాద్, గంగిశెట్టి గంగాధర, జగదీష్ కుమార్, శ్రీనివాస్, సత్యనారాయణ, దేవాలయ సిబ్బంది లావణ్య, శ్రీధర్, రమాదేవి, కృష్ణ, అర్చకులు ఉప్పల ఆదిత్య శర్మ, సేవా సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



## బోనాల సంబరాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల సందడి

### అమ్మవారి, పోతురాజు వేషాల్లో చిన్నారులు




**వేములవాడ, ఆగస్టు 8 (ప్రజాబలం ప్రతినిధి):** వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో శనివారం బద్దిపోచమ్మ బోనాల సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు అమ్మవారి, పోతురాజు వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనాలను ఎత్తుకుని భక్తిశ్రద్ధలతో వేములవాడ బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. చిన్నారుల సంప్రదాయ వేషధారణలు, బోనాల ప్రదర్శనతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటూ తెలంగాణ సంస్కృతి, ఆచార వ్యవహారాలను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఏజీఎం ముద్రకోల రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించడం ఎంతో ముఖ్యమన్నారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ద్వారా చిన్నారుల్లో మన సంప్రదాయాల పట్ల ఆసక్తి, గౌరవం పెరుగుతుందని తెలిపారు. బోనాల పండుగకు సంబంధించిన వేషధారణలతో విద్యార్థులు పాల్గొనడం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని, వారిని అభినందించారు. కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్లు సునీల్ కుమార్, మమత, జోనల్ పీఈటీ శ్రీకాంత్, ప్రిన్సిపాల్ సుదేశి, డీన్ అంజయ్య, సి-బ్యాచ్ ఇన్‌చార్జ్ అరుణ్ కుమార్, ప్రైమరీ ఇన్‌చార్జ్ ప్రవళిక, శివాని, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జిలు హరీష్, అరుణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, పీఈటీలు సుధాకర్, మారుతి, కవితతో పాటు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.



## బొల్లం శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన

### బీజేపీ జిల్లా, మండల నాయకులు



**కోనరావుపేట, ఆగస్టు 8 (ప్రజాబలం ప్రతినిధి):** కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామానికి చెందిన బొల్లం శ్రీనివాస్ మాతృమూర్తి స్వర్గస్తులైన విషయం తెలుసుకున్న భారతీయ జనతా పార్టీ జిల్లా, మండల నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.
ఈ సందర్భంగా బొల్లం శ్రీనివాస్‌తో పాటు లక్కం నారాయణ కుటుంబ సభ్యులను బీజేపీ నాయకులు పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మాతృమూర్తి మృతి కుటుంబానికి తీరని లోటని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.
ఈ పరామర్శ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు గొట్టె రాంచందర్, జింక వెంకటి, మోతుకు మోహన్, వెలిశాల రవీందర్, ఆకుల నాగరాజు, పుట్ట లింబయ్య, కుమ్మరి దిలీప్, లక్కం నారాయణ, శ్రీగదా వేణు, కొండం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధల మధ్య నేటి నుంచి ఉజ్జయినీ మహంకాళి బోనాలు

### నాలుగు రోజుల పాటు అమ్మవారి జాతర మహోత్సవాలు



**వేములవాడ, ఆగస్టు 8 (ప్రజాబలం ప్రతినిధి):** ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర మహోత్సవాలకు ఆలయం ముస్తాబైంది. ఆదివారం నుంచి బుధవారం వరకు నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. జాతర మొదటి రోజైన ఆదివారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం మహిళా భక్తులు సంప్రదాయబద్ధంగా బోనాలు సమర్పించనున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. రెండో రోజు సోమవారం వికాస తరంగిణి మహిళా బృందం ఆధ్వర్యంలో భక్తి పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అమ్మవారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకోనుంది. మూడో రోజు మంగళవారం అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించడంతో పాటు శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ప్రత్యేక దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.
జాతరలో చివరి రోజైన బుధవారం శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారితో పాటు శ్రీ మహాప్రత్యంగిరా అమ్మవారు, శ్రీ భగలాముఖి అమ్మవార్లకు ఘనంగా పుష్పాభిషేకం నిర్వహించనున్నారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేకంగా అరుదైన హోమ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే అమ్మవారి బోనాల జాతర మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు.

## తపోవన్ ద స్కూల్ బహదూర్ పల్లి లో ఘనంగా

### బోనాల సంబరాలు









తపోవన ద స్కూల్ బహదూర్ పల్లి యాజమాన్యం ఎం. సతీష్ కుమార్, ఆధ్వర్యంలో వాయుపుత్ర కాలనీ బహదూర్ పల్లి లో ఘనంగా బోనాల సంబరాలు జరిగాయి ఈ కార్యక్రమంలో స్కూల్ కి సంబంధించిన సిబ్బంది మరియు టీచర్లు నందిని, సబిత, సౌమ్య ,భవాని, మాధవి, మల్లిక, దీపిక ,మేఘన మరియు యాజమాన్యానికి సంబంధించిన మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు,

## లండన్ కిడ్స్ తులసి నగర్ స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు




లండన్ కిడ్స్ తులసి నగర్ స్కూల్ యాజమాన్యం ఎం. సతీష్ కుమార్, ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ ఫేస్ 2, తులసి నగర్ 2 లండన్ కిడ్స్ స్కూల్లో ఘనంగా బోనాల సంబరాలు జరిగాయి ఈ కార్యక్రమంలో స్కూల్ కి సంబంధించిన సిబ్బంది మరియు టీచర్లు లక్ష్మిప్రసన్న, ఝాన్సీ రాణి, నందిని,సంతోషిని, సుధారాణి , రాజేశ్వరి , మరియు యాజమాన్యానికి సంబంధించిన మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు,

## అన్నదాన సేవలో మరో మైలురాయి

### 1946వ రోజుకు చేరుకున్న మై వేములవాడ సేవా ట్రస్ట్



**వేములవాడ, ఆగస్టు 8 (ప్రజాబలం ప్రతినిధి ):** అన్ని దానాల్లోకెల్లా అన్నదానం మిన్న అనే సంకల్పంతో మై వేములవాడ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1946 రోజులుగా కొనసాగుతున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక టీటీడీ ధర్మశాల, రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలు, అన్నార్తులకు అన్నదానం నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి పుట్టినరోజు సందర్భంగా రిటైర్డ్ ఎల్.ఐ.సి. డెవలప్‌మెంట్ ఆఫీసర్ సావనపల్లి లక్ష్మణాచారి--జయంతి దంపతులు, కుటుంబ సభ్యులు నేటి అన్నదాతలుగా సహకరించారు. అలాగే శాశ్వత దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వరరావు--స్నేహాలత దంపతులు, ప్రతాప--స్వప్న--సంపత్ దంపతులు, నగుబోతు రవీందర్--జ్యోతి దంపతులు, గణాచారి మఠం శైలజ--సాంబశివు దంపతులు, దేవరాజు ఉమ--బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత కుటుంబ సభ్యులు తదితరులు సహకరిస్తున్నారని ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు.
పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర శుభకార్యాల సందర్భంగా పేదలు, అన్నార్తులకు ఒక్కపూట అన్నదానం చేయాలనుకునే దాతలు ట్రస్ట్ సభ్యులను సంప్రదించాలని లేదా 9246939388 నంబర్‌కు ఫోన్ చేయాలని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మధు మహేష్, పసుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com